చెన్నపురి ఆయుర్వేదకలాశాల.

ఆయుర్వేదమును లక్ష్యలక్షణములతోడను పాశ్చాత్య వైద్యమందలి యనాటమీ ఫిజియాలజీ మొదలగు వానితోడను గఱపబడును.

ఇందు "ఆయుర్వేదభూషణ" అను సంస్కృతశాఖయు "భిషగ్వర" అను ఆన్ధ్రశాఖయును రెండుశాఖలు గలవు.

సంస్కృతశాఖకు నాటకాంత సంస్కృతజ్ఞానము గలవారుగ నుండవలెను.

ఆన్ధ్రశాఖకు తెనుగున మంచి భాషాజ్ఞానము గలిగి యుండవలెను.

విద్యార్థులు 16 వత్సరములకు తగ్గకను 24 వత్సరములకు మించనివారుగ నుండవలయును.

కలాశాలయందు జేరగోరువారు అక్టోబరుమాసాంతమునకు దరఖాస్తులను బంపుకొనవలెను.

వివరములు గోరువారు కలాశాలాధ్యక్షులకు వ్రాసి తెలిసికొనవచ్చును.

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్లు,
ఆయుర్వేదకలాశాల, [illegible]
ఎ. వి. యస్., ఎ. యం. ఎస్.
[illegible]

‘यस्मिन् देशे हि यो जातः तज्जं तस्यौषधं हितम्’ वाग्भटः.

Ayurvedasrama Series--14.

VISHUCHI OR CHOLERA

(Etialogy, Treatment & Preventives.)

BY

Vaidyaratna Pandit D. Gopalacharlu,

Ayurvedamarthanda, Bhishangmani, A. V. S.,

Principal, Madras Ayurvedic College and Senior Physician,

Madras Ayurvedic Free Dispensary, Madras,

President, All India Board of

Ayurvedic Education, &c.

AYURVEDASRAMA, MADRAS.

1917.

[PRICE As. 0-8-0,

MADRAS:

Printed at the Ayurvedic Printing Works,

55, Acharappan Street, George Town,

and Published from Ayurvedasramam, Madras

[illegible] పాఠ్యము.



ఆయు[illegible] — ౧౫.

వి షూ చి - క ల రా.

నిదానము, చికిత్స, [illegible] నుపాయములు.

ఇది

[illegible] ప్రధానాధ్యక్షులును,

[illegible] ప్రధాన చికిత్సకులును,

[illegible] వైద్య [illegible]

[illegible]

శ్రీ [illegible] ఆచార్యులు,

ఆయుర్వేద [illegible], [illegible], ఏ. వి. యస్., వారిచే

రచింపబడినది.

చెన్నపురి.

రిజిష్టర్డ్—కాపీరైట్.] ౧౯౧౭. [వెల ౦-౪-౦.

దొరకు స్థలం :
55, ఆచారప్పన్ వీధియందుగల
వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులవారి
స్వకీయాయుర్వేదముద్రాయంత్రమున ముద్రింపబడి
ఆయుర్వేదాశ్రమమున ప్రకటింపబడియెను.



వైద్యరత్న పండిత డి. గోపాలాచార్లు,

ఎ. వి. ఎస్. అండు ఎ. ఎల్. సి.

పీఠిక.

అంటురోగములలో చేరిన కలరావ్యాధి ప్రకృతకాలమున పలుదేశముల యందు విజృంభించి యనేకులను దానికి నాహుతిగ జేసికొనుచుండుట యందరి కిని విదితము. నేను నావిద్యాభ్యాస కాలమునుండియు ప్రజల దీనిబారినుండి తొలగింపజేయు ప్రయత్నములు జేయుచుంటిని. నావంశపరంపరలనుండియు, పూర్వులగు నాగురువర్యులనుండియు, గ్రహించిన విషూచి నివారణోపాయములను జేర్చి అందరకు నుపయోగించునటుల చిన్నపొత్తముగ రచించి ప్రచురించిన నుపయోగముగునని తలచి కొన్ని వత్సరములకు పూర్వము చిన్నపొత్తమును వ్రాసి యుంటిని. గాని ప్రచురింప నుద్దేశించి యున్న తరుణమున నాంధ్రదేశమున ఖ్యాతి కాంచి శాస్త్రముల నాంధ్రసారస్వతమున నలంకరింపం జేసిన విజ్ఞానచంద్రికా గ్రంథమాలయందు శ్రీయుత డాక్టర్. ఆచంట. లక్ష్మీపతి, బి.ఏ. యమ్. బి. సి.యమ్. గారిచే 1910 సం॥ వ్రాసి ప్రచురింపంబడిన కలరా యను పుస్తకమున నైయుండవలివారి కోరికననుసరించి నాదెలిసిన కొన్ని యాయుర్వేదీయచికిత్సల ప్రచురించితిని. వాని యుపయోగమును నాంధ్రసోదరులు గ్రహించి నాటనుండియు ననేకులు మనయాంధ్రదేశమునకు హితమగు పథ్యాపథ్యములు మందులు [illegible] మున్నగువానితో గూడిన ఆయుర్వేదీయ పద్ధతులతో జేరిన విషూచీ చికిత్సాబోధకమగు పుస్తక మవసరమని కోరియుండిరి. మరియు నిక్కాలమున సమరసంక్షోభాదులచే నన్యాక్షౌషధములు దొరకమిచే గలిగిన కలవరమునుకూడ మనంబున నిడికొని భారతవస్తుసంచయముతో గూడిన మహర్షులయొక్క చికిత్సలే భారతీయులను సోదరన్యాయమున గాపాడగలవనియు ముచ్చటించిరి. ఇట్లు అనేకమిత్రుల కోర్కె ననుసరించి యిరువదియైదువత్సరము లుగ నాయనుభవమునందున్న విషూచీ చికిత్సలను అది వ్యాపించుచుండుటవలన తగు సూచనలను జేర్చి ఈ గ్రంథమాలయందు పదునాలవకుసుమముగ నీపుస్తక మును ప్రచురించినాడను. ఇం దుదహరించిన చికిత్సలు సామాన్యముగ వైద్యుల చేతను గృహయజమానులచేతను గూడ [illegible] చేసికొనదగినవిగను పల్లె

టూరులయందును సులభముగ దొరకని యౌషధములతో చేరినవిగను నున్నయవి. కొన్ని మాసములుగాని కొన్ని దినములుగాని గడపిచేయునవియును, మంత్రములు మొదలగువాని సాహాయ్యమునుండి యతిశ్రమచే చేయదగినవియును ఇందు జేర్పలేదు. ముఖ్యముగ నీపుస్తకమును సర్వజనసామాన్యమున నుపయోగపరచు నుద్దేశమున వైద్యసాంకేతికముల నెందు వ్రాసియుండలేదు. మరియు వాతపిత్త కఫముల భేదములను పాటించి చికిత్సావిధానమును జూపక సామాన్యముగ త్రిదోషసామ్యమును గలిగించు చికిత్సలను వ్రాసినాడను. ఇందుకు శాస్త్రీయవైద్యసోదరుల మన్నింప వేడెదను.

ఈవ్యాధియొక్క నామము లోకమున విషూచి లేక కలరాయున్న ప్రసిద్ధముగాన నీగ్రంథమునకుగూడ "విషూచి-కలరా" యనియే పేరు పెట్టితిని.

ఈచిన్నపొత్తమును : విషూచీచరిత్రము, నిదానము, చికిత్స, స్వాస్థ్య రక్షణోపాయములను నాలుగు ప్రకరణములుగ విభజించితిని.

మొదటిప్రకరణము.

ఇందు విషూచీవ్యాప్తి దొరతనమువారి స్వాస్థ్యసంరక్షాధ్యక్షుని నివేదికలనుండి తెలుపబడినది. వేదముల కాలముననే విషూచి కలదనియు క్రమముగ దానిని ఆయుర్వేదవిదులు విశేషముగ చికిత్సాదివిధానములతో దెలిసికొనిరనియు నిది వైదిక కాలమందలి వ్యాధియనియు దెలుపబడినది. మరియు దీనికిం గల లోకవ్యవహారనామములును వ్యాపకతయుకూడ వివరింపబడినవి.

రెండవప్రకరణము.

ఇందు పాశ్చాత్య ఆయుర్వేదమతముల నిదానసిద్ధాంతంబును విషూచీ సామాన్యలక్షణములును విషూచియొక్క ప్రథమ ద్వితీయ తృతీయావస్థలందు సాధ్యాసాధ్యలక్షణములను సాంక్రామికలక్షణములును జూపబడినవి.

మూడవ ప్రకరణము.

ఇందు విషూచిచికిత్సకు పూర్వము ఆచరింపదగిన నియమములును, తన్నివారకములగు మాత్రలును, కషాయములును, నస్యములును, అంజనంబును, [illegible]ములును, [illegible] విధానంబును నిరూపితములు. మరియు దప్పి, వెక్కిళ్లు, వాంతులు, కాళ్లుకొంకరలుపోవుట, నాడిక్షీణించుట, మూత్రము బంధించుట మొదలగు నుపద్రవములకు కషాయములు, మాత్రలు, లేపములు, తైలములు మొదలగు ప్రత్యేకచికిత్సలును గనుపరుపబడినవి.

నాలవ ప్రకరణము.

ఇందు విషూచిరోగమున పథ్యాపథ్యములను విషూచి వ్యాపించి యుండుకాలమున నవ్యాధి సోకకుండుటకై యాచరింపదగిన యుపాయములును; ఇండ్లు, దొడ్లు, ఇంటిచుట్టునుగల భాగములు మొదలగువానిని, వస్త్రములు, పాత్రలు, శయనోపకరణములు మొదలగువానిని పరిశుభ్రము జేయవలసిన పద్ధతులును స్వాస్థ్యరక్షణోపాయములును నిరూపితములు.

“దేశే యస్య జనో జాతః తజ్జం తస్యౌషధం హితమ్” అనగా ఏదేశమందు జనించిన వానికి నాదేశమున జనించిన యౌషధులచేత జేయంబడు చికిత్సయే యుచితమని పలికిన శ్రీవాగ్భటుని వాక్యంబుల మనంబున నిడికొని సాధ్యమగునంతవరకు దేశీయౌషధములను దేశీయులకు మలవాటులోనుండు పథ్యాపథ్యములను జేర్చి యీ చిన్నిపుస్తకమును వ్రాసి ప్రచురించినాడను. భారతసోదరులు ఇందలి లోపములను మన్నించి గుణములను గ్రహింప ప్రార్థితులు.

౯-౮-౧౨
శ్రీకృష్ణజన్మాష్టమి,
ఆయుర్వేదాశ్రమము,
౫౫, ఆచారప్పన్ వీధి.

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులు.




శ్రీ

విషయానుక్రమణిక.

విషయము. పుట.

చతుర్థప్రకరణము.



సూచన.

ఇందు గనుపరుపబడిన మోతాదులను వానిసాంకేతికములను [illegible] సరిగ యుపయోగింపవలెను.

గురిగింజ	కుంకుడుగింజ
పెసలగింజ	ఒకగుక్కెడు (అ ౧ అవున్స)
కందిగింజ	అరఅవున్సు
శనగగింజ	ఐదుబొట్లు
ఉసిరికపరిమాణము	చిన్నియుండలు
నాల్గుమాసలు	

పైమోతాదులన్నియును ప్రాయికముగ పదివత్సరములకు పైబడినవారి నుద్దేశించి చెప్పబడియున్నవి. వీనికి ఒకమాసమునుండి యారుమాసముల వయస్సుగల శిశువులకు పైమోతాదులలో పదియవభాగము మోతాదుల నియ్యవలెను. ఆరుమాసములనుండి ఒకవత్సరమువరకును ఆరవభాగము మోతాదుల నియ్యవలెను. ఒకవత్సరమునుండి నాలుగువత్సరములవరకు నాలవవంతు మోతాదుల నియ్యవలెను. నాలుగువత్సరములనుండి పదివత్సరములవరకును అర్థపరిమితిగల మోతాదునియ్యవలెను. పదివత్సరములనుండి మామూలు మోతాదుల వాడవచ్చును. మర్మములుగ నున్న వారికి పైమోతాదుల నుపయోగించునపుడును ఉచితానుసారముగ తెలిసి యుపయోగింపవలెను.

మాత్రరూపములకు మందులుగాక కషాయాదులనుకూడ పైవయోభేదముల ననుసరించి మోతాదులం గనిశ్చి యుపయోగించునది. ఒకగుక్కెడు ఒక అవున్సుగా భావించునది. ఇందు అచ్చటచ్చట "కొంచెముకొంచెము" అని కషాయాదుల యుపయోగమున తెలుపబడినది. దీనిని సమయమును రోగస్థితిని రోగిబలమును ఎరిగి పరిమితి నుపయోగించునది.

వస్త్రములు శుభ్రముపరచుట అను విషయమున గనబరచిన [illegible] సోడా నిర్మాణము జేసికొనిన సోడినీళ్లు అనుదానికే 'పైచెడినిటిని' అని ప్రాయము స్థలములయందెల్ల గ్రహింపవలెను.

౧౧ - పుటయందలి ఐదవ పఙ్క్తియందు

'గ్రీష్మవసంతముల' అనుచోట 'గ్రీష్మవర్ష ఋతువుల'

అని చదువుకొనవలెను.



విషూచి - కలరా.

ప్రథమ ప్రకరణము.

ఇయ్యది యాకస్మికముగను క్రూరముగను వ్యాపించు సాంక్రామిక వ్యాధులలో నొకటియైయున్నది. ప్రపంచమున నుండు మానవసముదాయమున జరుగుచుండు లయమునకు కారణములగు వ్యాధులు పెక్కులుకలవు. అందు జ్వరము మొదటిదియనియు కలరా రెండవదియనియు దొరతనమువారి స్వాస్థ్యసంఘాధ్యక్షుని నివేదికయందు గనబరుపబడిన యీ క్రింది సంఖ్యలనుండి తెలియుచున్నది.

సం॥	కలరా.	జ్వరము.
౧౯౧౦	౩౨౫౯౪	౩౨౧౩౮౧
౧౯౧౧	౫౮౧౬౪	౨౯౮౭౮౮
౧౯౧౩	౩౬౬౩౦	౨౭౮౦౨౪
౧౯౧౪	౭౮౪౪౯	౩౦౬౭౨౦
౧౯౧౫	౩౦౦౯౮	౨౯౦౨౨౮

పై సంఖ్యలనుండి యీ విషూచివ్యాధి క్రమముగ నానాట ద్విగుణాభివృద్ధిం గాంచియున్నది. విషూచివ్యాధివలెనే సాంక్రామికములలో జేరిన మసూరిక (మశూచికము) వ్యాధియు గూడ నానాట నభివృద్ధినందినట్టులు ఈ దిగువ కనుపరుపబడిన సంఖ్యలనుండి తెలియుచున్నది.

సం॥	మసూరిక.	సం॥	మసూరిక.
౧౯౧౦	౧౯౧౮	౧౯౧౪	౨౬౮౮౯
౧౯౧౧	౨౩౮౧౬	౧౯౧౫	౨౪౦౩౮
౧౯౧౩	౧౪౮౦౨		

ఈ సంఖ్యలజూచిన నీవ్యాధియొక్క వ్యాప్తియు కొంతవరకు (అనగా ఒకటికి ఒకటిన్నర) అధికమైనట్టులు స్పష్టమగుచున్నది.

జ్వరము, కలరా, మసూరికము, ఈ మూడిటి సంఖ్యలలో జనసామాన్యముగను దేశసామాన్యముగను వ్యాపించు జ్వరముయొక్క వ్యాప్తి కొంచె మించుమించుగ నొకస్థితిలో నున్నది.

కలరా మసూరికముల వ్యాప్తిమాత్రము నానాట నభివృద్ధిలో నున్నట్టులు తేటబడుచున్నది. అందును కలరావ్యాధి ౧౯౧౦-వత్సరమునుండి చూపబడిన దొరతనము వారి నివేదనములయందలి సంఖ్యలం బట్టిచూడ విషూచి యను తనపేరును సార్థకముగ జేయుచున్నది.

ఈ సాంక్రామికవ్యాధుల వ్యాపనము క్రమముగ నభివృద్ధినొందుటంజూడ దొరతనమువారు లక్షలకొలది ద్రవ్యమును వెచ్చించి పారిశుద్ధ్యసంఘములనుండి చేయు ప్రయత్నములు నిష్ఫలములని తోచకమానదు. దొరతనమువారు ఆరోగ్యసంరక్షణమునకై యెట్టిప్రయత్నముల నలుపకున్నచో కలరా మసూరికము ప్లేగు మున్నగు సాంక్రామికవ్యాధులు వాని ప్రభావముల నింతకన్న నెన్ని వేలభాగముల నధికముగ జూపి యుండునో యూహింపజాలను.

లోకమున ప్రతిమనుజునకును విద్యయు నారోగ్యంబును ఆవశ్యకములు. ఈరెంటిలో నేది లేకున్నను వానిజన్మము నిరర్థకము. అందుకు మొదటిదియగు విద్య లేకున్న కేవలము నిష్ప్రయోజనము. ఏల? యన:—కొంతవరకైనను విద్య నభ్యసించినవాడు వానియారోగ్యమునకై ప్రయత్నముల సలుపుకొనును. వానిని ప్రాయికముగ నేవ్యాధులు నాశ్రయింపజాలవు. విద్యాబుద్ధులు లేక సామాన్యముగ నారోగ్యమార్గముల నాశ్రయించనివారికనే క్రూరములగు విషూచి, ప్లేగు, మసూచికము మున్నగు సాంక్రామిక వ్యాధులు విశేషముగ నాశ్రయించుచుండును. ప్రతిమానవుడును విద్యాబుద్ధులు గల్గియుండినగాని స్వయముగ నారోగ్యసంరక్షణము జేసికొనుటకు వీలుకల్గదు. ఈయర్థమునే పూజ్యులగు వాగ్భటాచార్యులు "శరీరచిన్తాం నిర్వర్త్య..." అను వాక్యముచే నుద్ఘోషించియున్నారు.

[illegible]రతసమువారు తమశక్తికొలది ప్రజలయొక్కయు దేశముయొక్కయు స్వస్థతను గాపాడుటకై తగునదుపాయముల గలిగించెదరు. దానికిదగు ద్రవ్యమును వెచ్చించెదరు. హితముల బోధించు గ్రన్థముల బ్రచురించెదరు. సన్మార్గముల జూపెదరు గాని విద్యావంతులుకాని కొందరు మన్వాదిస్మృతులయందు ఆరోగ్యవర్ధనమునకై బోధితములగు నాచారమార్గములను చరకాదులయందు బోధితములగు నారోగ్యమార్గములనుకూడ పాటింపక హితాహితముల దెలియకచేయు దురాచారముల మానుపజాలరు. పథ్యాపథ్యముల నెరుంగని ముట్టివారికి సామాన్యముగనైనను విద్యాబుద్ధులు గరపుట ద్వార

తనమువారి మొదటిపనియైయున్నది. ఆయాప్రాంతములగల జ్ఞానవంతు లచ్చటచ్చటనుండు సామాన్యజనుల కందరకు విద్యాబుద్ధుల గరపవలెను. పలుమారు ఆరోగ్యమార్గముల నుపదేశింపవలెను. ఈ రెండువిధములగు నుపాయముల జేసినచో సామాన్యప్రజలందరును కొంతవరకు విద్యాబుద్ధుల గ్రహింపనోపుదురు. పిదప క్రమముగ నారోగ్యమార్గముల నాచరింపగడంగుదురు. అట్టి స్థితిసంభవించినగాని దుర్వృత్తములగు సాంక్రామికవ్యాధుల యాటోపముతగ్గదు. అటుకానిచో దొరతనమువా రారోగ్యసంరక్షణమునకై వత్సరమున కెన్నిలక్షలధనమును వెచ్చించినను ఫలముగనబ్బదు. శాసనసభలయందు మన సభాసదులు, ఆరోగ్యరక్షణమునకై దొరతనమువారు చేయుధనసహాయము చాలదని కంఠశోషగ వాదోపవాదముల జరిపియు ప్రయోజనము లేదు.

— విషూచి - వేదములు. —

ఈక్రూరవ్యాధిని పరమప్రాచీనములని ప్రాచ్యపశ్చిమ పండితవరులచే నిర్ణయింపబడిన ఋగ్వేదాదులయందు * «విషూచి»—

* ఋగ్వేదము ౫-వ అష్టకము, 1-వ యధ్యాయము, 1-వ వర్గము, "సోమారుద్రా వివృహతం విషూచీమమీవా యా నో గయమావివేశ । ఆరే బాధేథాం నిరృతిం పరాచైరస్మే భద్రా సౌశ్రవసాని సన్తు" టీ-భా "తాం విషూచీం - విష్వక్ - సర్వతః గచ్ఛన్తీం అమీవాం-రోగం వివృహతం - వియోజయతం."

అథర్వవేదము—7-వ కాండము, 4-వ అనువాకము, 44-వ సూక్తము, "సోమారుద్రా [illegible] వివేశ । బాధేథాం దూరం నిరృతిం పరాచైః కృతం చిదేనః ప్రముముక్తమస్మత్" టీ-భా, "విషూచీం-విష్వగ్గమనాం, అమీవాశబ్దవాచ్యం రోగం వివృహతం - వినాశయతం."

మైత్రాయణిసంహిత 3-2., కాఠకసంహిత 37-18., తైత్తిరీయబ్రాహ్మణం 2.6.1., శతపథబ్రాహ్మణం 12-7-3-2.

యను నామములచే నామచుండుటం గనవచ్చును. ఇయ్యాది యనేకవిధంబులగు రూపములచే నలుదెసల వ్యాపించునది యనియు, ఏకకాలమున నతివేగమున ననేకులయందు వ్యాపించు పాపరోగమనియు దీనిస్వరూపమునునిశ్చయించి దానికనుగుణమగునట్లు విషూచియను సంజ్ఞ నేర్పరచియున్నారు.

—(విషూచి - ఆయుర్వేదము.)—

పిమ్మట దానిననుసరించి యాయుర్వేదవిద్యను వ్యాపింపజేసిన * చరక సుశ్రుత వాగ్భటాదులు ఈవ్యాధికి ఊర్ధ్వాధోద్వారములయందు వమన విరేచన రూపముగ వ్యాపించుటంజేసి 'విషూచి' యనియు, వాతాదిప్రకోపవశంబున శరీరమునం దంతటను వ్యాపించి విశేషముగ సూదులచే బొడిచినట్లు బాధించుటంజేసియు విశేషముగ మరణమును సూచించుటంజేసియు "విసూచి" యనియు సార్థకనామముల నిడి తమతమ తంత్రములయందు వ్యవహరించిరి. కావున వేదకాలమునుండి యాయుర్వేదకాలమువరకు నీవ్యాధియొక్క స్వరూపస్వభావములను వివరించునట్లు ఏర్పరుపబడిన పద్ధతులబట్టి యీ వ్యాధియొక్క సంజ్ఞావాచకములగు శబ్దముల రెంటికిని నాల్గువిధ

---

* చరకవిమానస్థానము, అ. 7.
"తత్ర విషూచికా మూర్ధ్వం చాధశ్చ ప్రవృత్తామదోషాం యథోక్తరూపాం విద్యాత్."
సుశ్రుత ఉత్తరతంత్రము, అ-56, "సూచీభిరివ గాత్రాణి తుదన్ సంతిష్ఠతేఽనిలః। యస్యాజీర్ణేన సా వైద్యైర్విషూచీతి నిగద్యతే."
వాగ్భటసూత్ర, అ-8, "వివిధైర్వేదనోద్భేదై ర్వాయ్వాదిభృశకోపతః। సూచీభిరివ గాత్రాణి విధ్యతీతి విషూచికా."
"శబ్దకల్పద్రుమము, విశేషేణ సూచ్యత్వం సూచయతీతి విషూచి."

ములగువ్యుత్పత్తుల నిర్ణయించుకొనదగియున్నది. అదియెట్లనగా:-
"విషు-నానా-అఞ్చతి-గచ్ఛతీతి-విషూచీ" "విష్వక్ (సర్వతః) అఞ్చతీతి విషూచీ" "విశేషేణ సూచీభి రివతుద్యత ఇతి విసూచీ" "విశేషేణ సూచయతి మృత్యుమితి విసూచీ" ఈనాల్గువిధములగు వ్యుత్పత్తుల యర్థము పైన వివరింపబడియున్నది.

—(విషూచి - లోకవ్యవహారనామములు.)—

ఇయ్యది క్రూరమగు నొకదేవతయొక్క పీడనమున గల్గు వ్యాధియని పామరజనులు లోకమున సామాన్యముగ వాడుకొనియెదరు. వారలు దీనిని మరిడిమహాలక్ష్మమ్మ, తుడవులమ్మ, మారియమ్మ, గొట్టాలమ్మ, అను క్షుద్రదేవతల నామములచే కూడ వాడెదరు. మరియు విషూచి జాడ్యము, వాంతిభేది, గత్తర, దూము, విషభేది, భార్గిస్తి, చేదు, హైజా, అనునివి మొదలగు నామభేదములచే నాయాదేశముల పలుదెరంగుల వాడుచుందురు. ప్రకృతకాలమున "కలరా" అని చెప్పినచో సకలదేశములయందును సుబోధముగ నీవ్యాధియని గ్రహించెదరు.

—(విషూచి - ప్రాచీనత.)—

ఇయ్యది కొన్ని శతాబ్దములకు పూర్వకాలంబున బయలు వెడలిన యొక నవీనవ్యాధియని యూరపుచరిత్రకారులు వ్రాయుచున్నారు. పైజెప్పబడినట్లు మన గ్రంథములబట్టి పరికించితిమేని ఈవ్యాధి నూతనముగాక అతిప్రాచీనమగు వేదకాలమునకే వ్యాప్తినందియుండెనని యప్పటి యార్య ఋషిపుంగవుల విమర్శన

ములకును పరీక్షలకును లోనై వారికి స్వరూపస్వభావంబులు యథాస్థితరూపంబున దెలియునంతటి పరిచితికి పాత్రంబై వచ్చుచున్నదని తెలియగలదు.

—విషూచి - వ్యాప్తి.—

అధునిక చరిత్రకారులీవ్యాధియొక్క వ్యాప్తినిగురించి యిట్లు వర్ణించుచున్నారు. ఈవ్యాధికి జన్మస్థానము ఆసియాఖండము. అందును భారతభూభాగము. అందును వంగదేశము. ఇట్లాసియా ఖండము జన్మదేశముగా నేర్పరచుకొనిన యీవ్యాధి ౧౮౧౭-వ క్రీస్తున వత్సరమున విజృంభించి తూర్పున జపానువరకును దక్షిణమున మార్షల్ లంకలవరకును పశ్చిమమున కాస్పియన్ సముద్రమువరకును వ్యాపించెను. ఇట్లు తీవ్రముగ నీవ్యాధి వ్యాపించుచుండినను క్రీస్తశకము ౧౮౩౦-వ వత్సరమువరకు నీవ్యాధి యూరోపాఖండముపై పునరు తనదృష్టిని ప్రసరింపచేయ లేదు. కాని ఆవత్సరముననే అఫగనిస్థానము, పరిషియాల మార్గమున ప్రయాణముసాగించి రషియాదేశంబునజేరి యచ్చట పిచ్చలవిడిగ విహరించి యచ్చటనుండి యూరోపాయందలి దేశంబుల నన్నిటిని ప్రవేశించుచు నాశనముజేయుచు క్రమంబున ౧౮౩౨-వ వత్సరమున నింగ్లాండుకు చేరెను. పిదప నచ్చట తనకృత్యమును నిర్వర్తించుకొన్నిమండుచుండు వేసవికాలపు రెండెలకును భయమందక యట్లాంటిక్కు సముద్రము నవలీలగదాటి కనడా యునైటెడ్డు స్టేట్సు మొదలగు ప్రదేశంబుల విస్రంభ

విహారము నవలంబించి గొప్పగొప్పపట్టణముల నన్నిటిని దిలకించెను. ఇట్లీసమరయాత్ర ౧౮౩౭-వ సంవత్సరమువరకు కీవ్యాధికి ఖండాంతరములయం దనర్గళముగ జరిగెను. పిమ్మట నిట్టియాత్ర యాదేశంబుల నాలుగైదుసారులుమాత్రము జరిపినట్లు తెలియుచున్నది. ఇట్లు విచ్ఛిన్నమగు సంచారముగలిగి బహుకాలంబుగ వ్యాప్తినందియుండు నీవ్యాధి జనించుటకు కారణమెద్ది? యని విచారింతము.

ద్వితీయప్రకరణము.

—॥ విషూచి - పాశ్చాత్యవైద్యనిదానము. ॥—

ఈవిషయమై పాశ్చాత్యవైద్యవిశారదులు పరిశీలించి ౧౮౮౪-వ క్రైస్తవ వత్సరమునకు పూర్వమువరకు నితరవైద్యక పద్ధతులవారు నక్కాణించునట్లే యీవ్యాధికి అజీర్ణాద్యనేక కారణముల చెప్పుచుండిరి. ఈవిషయము, వారు "కలరా" శబ్దమునుగురించి చేయు * నవయవార్థములను పరిశీలించిన తెలియగలదు.

పిమ్మట ప్రాయికముగ రోగిసామాన్యమునకు సూక్ష్మక్రిములే ముఖ్యకారణములని స్థాపించిన "కాచి" యను జర్మను దేశీయ వైద్యశిఖామణి కలరావ్యాధికిని కామావంటి సూక్ష్మ

* Vide Page 115. Encyclopedia & Dictionary of Medicine and Surgery Vol. II.

క్రిములే కారణములనియు సూక్ష్మక్రిములే జలము మొదలగు పానీయద్రవ్యములనుండి శరీరమున బ్రవేశించి విషూచి-కలరాను గలిగించుననియు నొకయభిప్రాయమును ౧౮౮౪-వ వత్సరమున సిద్ధాంతపరచెను. నాఁటి మొదలుగ ప్రత్యక్షసిద్ధమగు నీకారణమే యుక్తమని దేశంబులయందంతటను ఏకగ్రీవముగ నంగీకరింపబడెను. అయినను విషూచివ్యాధి కలిగినవారిలోఁ గొందరి దేహములను పలుమారు పరిశీలించినను కామావంటి క్రిములగు పడకుండుటచే రోగసామాన్యమునకు చెప్పిన సూక్ష్మక్రిములే యీవ్యాధికి ముఖ్యకారణము లనిచెప్ప వీలులేదని నిర్ణయించువారును అనేకుఁగొంద ఱేర్పడిరి. అయినను వీరికంటె పైవారిసంఖ్య యే దేశమునందంతటను నధికముగ నుండునట్లు తెలియుచున్నది. ఇట్టి వివరములందెలుపు గ్రంథములు ఆంగ్లభాషయందును తన్మతానుసారముగ వ్రాయబడు దేశభాషలయందును ప్రచురింపబడియుండుటచే గ్రంథభీతి నట నీవిషయమును విడచుచున్నాను.

—(విషూచి - ఆయుర్వేదసిద్ధాంతము.)—

ఋతుభేదముల ననుసరించి త్రిదోషములు చయప్రకోపప్రశమనంబుల నందుటయు పదార్థములయందలి మధురాది రసంబులు న్యూనాధిక్యంబుల నందుటయు శీతోష్ణస్థితులు తారుమారగుచుండుటయు స్వభావసిద్ధము. ఇట్లు భగవదధీనంబులై స్వధర్మంబులతోఁగూడ ఋతువులుమారు నవసరంబున క్రమప్రాప్తిచే హేమంత శిశిరాది ఋతువులాపతింప త్రిదోషము

లలో నొక్కటియగు కఫంబు ఘనీభావంబునందును. ఇట్లు హేమంత శిశిరంబులయందు సౌమ్యాదిగుణంబులకును తజ్జన్యములగు ధర్మంబులకును నలవాటుపడియుండు దోషాది దేహభాగంబులన్నియు శిశిరాంతంబున గలుగు నూష్మవలన వసంతఋతుధర్మంబులగు నాగ్నేయాది గుణంబులును తదాధారభూతములగు ద్రవ్యంబులును సంబంధించుచుండుటచే తదనుగుణముగ సాత్మ్యమును (అలవాటును) మార్చుకొనవలసియుండును. కనుక ఘనీభావమునందియుండు కఫము కరగి ద్రవించుటచే ప్రకోపము నొందును. ఆసమయంబున జాఠరవహ్ని ఋతుస్వభావమున తగ్గును. ఇట్లు కలిగిన యగ్నిమాంద్యముచే సంగ్రహణ్యాదులు వసంతమున సహజముగ నుత్పన్నములగుట కవకాశము కలుగును. పిదప నాగ్నేయకాలముయొక్క యంతిమభాగమగు గ్రీష్మఋతువు తలచూపును. ఇందు కాలస్వభావముచే మనుజబలము సహజముగ తగ్గును. వాతము చయావస్థనొందును. శ్లేష్మము క్షీణించును. వసంతఋతువునందంకురించిన యగ్నిమాంద్యము అనుబంధముగనుండును. ఇట్లు గ్రీష్మకచర్య గడచుచుండ సౌమ్యకాలమున కారంభకమగు వర్షఋతువు ప్రారంభించును. ఇందు వెనుకనుండి యనుబంధమగు నాగ్నేయకాలముయొక్క గుణములన్నియు శీతవాతములచేతను వర్షముచేతను ఎల్లపుడును మేఘములు ఆకసమున కప్పియుండుటచేతను భూబాష్పముచేతను నొక్కపెట్టున తగ్గును. మలినముతో

గూడియున్న యుదకము ప్రవహింపనారంభమగును. ఉదకములు కలుషములగుటచే నమ్లవిపాకమును బొందును. వసంతగ్రీష్మ ఋతువులయందలి యగ్నిమాంద్యము అనుబంధమగును. ఆరు మాసములుగ ననుబంధమగు నాగ్నేయకాలమువిడిచి సౌమ్య కాల మారంభించును. దీనిచే గ్రీష్మవసంతముల ఋతుసంధి తోపాటు దీర్ఘానుబంధమగు నాగ్నేయ (ఉత్తరాయణ) సౌమ్య (దక్షిణాయన) కాలములసంధియు నేర్పడును.

ఇట్టి రెండువిధములగు ఋతుసంధి కాలసంధులయందు గలి గెడి వ్యాధులుగుమార్పులే ప్రాణికోటికిని గలుగును. ఈమార్పు ముఖ్యముగ నగ్నిమాంద్యముగను ఉదకదోషముగను ఎన్నదగి యున్నవి. వర్ష ఋతువున సహజమగు మలినోదకము చెరువుల చెలమలను బావులయందును జేరి వసంతగ్రీష్మఋతువులలో భూమి యందు దాగియున్న యనేకవిధములగు రోగములకు కారణము లగు బీజముల నంకురింపజేయును. అందువలన స్వాభావికమగు నగ్నిమాంద్యముచేత వాతప్రకోపమునకు నిలకడయైన వర్ష ఋతువునందు విజృంభించి జనించును. పిదప తనమిత్రములగు గ్రహణియు అగ్నిమాంద్యంబును బలహీనంబును గలవారి మొదలను తనపేరు వినినమాత్రముననే భీతినొందువారిమొద లను ముందు ప్రకరణమున గనబరుపంబడు నపథ్యాహారముల సేవించువారిమొదలను తనదైన జశక్తులను జూపుచు దండయాత్ర నలుపుచుండును.

సౌమ్యాగ్నేయ సంధికాలమగు హేమంతశిశిరఋతువులకుజేరిన ఋతుసంధియందును పైయగ్నిమాంద్యాది దోషజన్యములగు విషూచిమొదలగు సాంక్రామికవ్యాధులు గలుగుటలేదు. ఏలయన — సౌమ్య ఆగ్నేయ కాలసంధియందు శరీర హానికరములగు వ్యాధులనన్నిటిని దూరము చేయుదగనంత బలము శరీరమున నుండుటచేతను, సమస్తవ్యాధులకు మూలభూతమగు నగ్నిమాంద్య మాకాలసంధియందు లేకపోవుటచేతను, సమస్త జీవకోటికిని జీవనమునకును ప్రధానమగు వాయువు (గాలి) మలినముగాక శుభ్రముగ నుండుటచేతను, ఆగ్నేయకాలమువలన తపింపంబడిన భూమి వెనువెంటనే చల్లబడుటగాని యుదకాది పదార్థములు మలినములును అన్నవినాశములును నగుటగాని యీసౌమ్య ఆగ్నేయ కాలసంధిలోకూడిన హేమంతశిశిరఋతువుల సంధియందు లేకుండుటంజేసియు నగ్నిమాంద్యవికారములగు విషూచి మొదలగు సాంక్రామిక వ్యాధులు తలచూప నవకాశము లేకయున్నది.

— విషూచీ సామాన్యలక్షణములు - ప్రథమావస్థ —

పైజెప్పంబడిన నిదానాదులనుండి గ్రీష్మవర్షఋతుసంధులజనించు క్రూరమగు నజీర్ణవ్యాధి విషూచియని తెలియుచున్నది. మరియు నీవ్యాధి యవస్థాభేదములచే నలసకమనియు దండాలసకమనియు వ్యవహరింపబడుచున్నది. దండాలసకమును కొన్నిగ్రంథములయందు విలంబికయని వచించెదరు.

ఈవ్యాధి కల్గినప్పుడు గోలుగోలుతరోషముగ విస్తారముగ విరేచనములగును. కొన్ని సమయములలో పసరు నురుగు మొదలగు వానితోగూడి జీర్ణముకాని యాహారపదార్థములు వాంతులగుచుండును. తెలుపడి పిదప గంజివంటి నీళ్లవిరేచనములగుటయుగలదు. వాంతులుకూడ నీటితో వెడలుచుండును. ఇత్తెరంగున వాంతులును విరేచనములును క్రమముగ నధికములై కొంతసేపటికి వాంతులైనను విరేచనములైనను నిలచును. లేక రెండును నొక్కసారిగ నిలచుటయుకలదు. పిమ్మట కడుపులోనొప్పి, ఆవలింతలు, కడుపుబ్బరము, మూత్రము వెడలక నిలచుట, దాహము, దప్పి, శరీరమున తాపము, శరీరమందలి రంగుమారుట, ఒడలువణకుట, రొమ్మునొప్పి, తలతిరుగుట, కాళ్లుచేతులు కొంకరలుబట్టుట, ఈలక్షణములు వరుసగ కలుగును. ఈవ్యాధియొక్క ప్రాథమికదశయందు పైజెప్పిన లక్షణములన్నియైనను, లేక వానిలో కొన్నియైనను కలుగును. ఈవ్యాధి తరుచుగ నీపై లక్షణములగు వాంతివిరేచనముల తోడనే ప్రారంభమగును. లేక కొన్ని సమయములలో నీవ్యాధి వాంతులతోనైనను విరేచనములతోనైనను ప్రారంభమగుటయు కలదు.

విషూచి ద్వితీయావస్థ - అలసకము.

పైజెప్పిన లక్షణములలో ప్రధానములగు వాంతులు విరేచనములు నిలిచిపోవును. మూత్రము తగ్గును. కడు

పుబ్బర మధికమగును. అపానవాతము నిలచును. కడుపులో గుడగుడయను శబ్దము కలుగును. దప్పి యధికమగును. చెమటలు క్రమముగ హెచ్చుచుండును. కంఠస్వరము హీనమగును. ఒడలు క్రమముగ చల్లనగుట కారంభించును. నాడి మందగించును. దోషములు ప్రకోపము నొందినకొలది వ్యాధి ముదిరి యధోద్వారమున వెడలు వాతమును మలమును అడ్డుపరచును. ఊర్ధ్వద్వారమున వెడలు ఉద్గారము (త్రేపుల) ను వాంతిని నిలిపివేయును. ఆమాశయమునందలి పాచకపిత్తము వమనముతో బైలు వెడలిపోవుటచేత లోపలికదిగియున్న యన్నము మొదలగు పదార్థసామాన్యము పచనము నొందక మందీభూతమై యామాశయమున శల్యమువలెనుండి క్రూరములగు శూలమొదలగు నుపద్రవముల గలిగించును. దానంజేసియే దీనిని *యలసకమని శాస్త్రజ్ఞులు నుడివిరి.

— దండకాలసకము. —

క్రమముగ దోషములు మిక్కిలి ప్రకోపము నొంది యామదోషముతో జేరి స్రోతస్సు లన్నిటియందును నిండి యుండును. దానంజేసి వమనవిరేచనములు బొత్తుగ నిలిచిపోవును. మూత్రనిరోధ మధికమగును. చెమటలు విస్తారములగును. కాళ్లు చేతులయందు కొంకరలధికములగును. నాడి

* "అలసం క్షోభితం దోషైః శల్యత్వేనైవ సంస్థితమ్ । శూలాదీన్ కురుతే తీవ్రాన్ ఛర్ద్యతీసారవర్జితాన్ । సోలసః" అష్టాంగహృదయ సూత్రస్థానము ఎనిమిదవయధ్యాయము.

నీరసమగును. దేహము నిండుమన లె చల్లబడును. కన్నులు లోనికి లాగికొనిపోవును. దప్పి సలుపుమీరు నీరు ద్రాగుచున్నను అడంగక మిక్కుటమగును. నాలుక తెల్లబడి తాటిపట్టయంచులవలె గరకుగల్గియుండును. కనుపుబ్బర మధికమగును. ఎక్కిళ్లును స్వరము సుస్వరమును లధికముగ సావరించును. ఈలక్షణములు విస్తరించుకొలది నేత్రములు ఇటునటుకదలక కొయ్యవలె నిలచి పోవును. ఈ సంకటము యను యవస్థను * దండకాలసకమని శాస్త్రజ్ఞులు చెప్పిరి. పైచెప్పిన లక్షణములలో కొన్ని కనిపించి నను రోగి యమపురికేగ సిద్ధముగనుండుచున్నాడని యెరుంగునది.

—[అసాధ్యలక్షణములు.]—

§ దంతములును గోళ్లును పెదవులును నల్లబడుట, మైమరచుట, ప్రాణశక్తియాగినయటుండుట, కన్నులులోనికి లాగికొనిపోవుట, కంఠస్వరము మిక్కిలి హీనమగుట, కీళ్లు సడలుట, నాడులు మిక్కిలి సన్నగిలుట, అంగా వాతనాడి కనిపించకుండుట, ఈలక్షణము లన్నియున్నను కొన్నియైనను కనుపించిన రోగి బ్రతుకుట దుర్లభమని యెరుంగునది.

* "...... ...అత్యర్థదుష్టాశ్చ దోషాః దుష్టామబద్ధాః | యాంతః స్థిరాం తనుం సర్వాం దండవత్ స్తంభయంతి చేత్ | దండాలసకం ... అసాధ్యం త్యజేదాశుకారిణమ్ ॥" అష్టాంగహృదయము సూత్రస్థానము అష్టమాధ్యాయము.

§ "యః శ్యావదంతౌష్ఠనఖోऽల్పసంజ్ఞో వమ్యర్దితోऽభ్యంతరయాతనేత్రః | క్షామస్వరః సర్వవిముక్తసంధిః యాయాన్నరః సోऽపునరాగమాయ" అష్టాంగహృదయము ఎనిమిదవయధ్యాయము.

—(విషూచి - సాంక్రామికము.)—

ప్రాచీనమహర్షులు ఈవ్యాధి విశేషముగ వ్యాపించు స్వభావముగలదియనియు విశేషముగ మృత్యువును సూచించు నదియనియు నన్వర్థబోధకమగు "విషూచి" యను నామధేయము నిడుటచే నియ్యది సాంక్రామికవ్యాధులలో నొకటిగ పరిగణించినటుల దెలియుచున్నది. ఈసాంక్రామిక వ్యాధులను పాశ్చాత్యవైద్యులు 'పండమిక్' (ఒకగ్రామమున నచ్చట చ్చటవ్యాపించు స్వభావముగలవ్యాధి), 'ఎపిడమిక్' (ఆదేశము నందంతటను విరివిగ వ్యాపించు స్వభావముగలవ్యాధి), 'పాండమిక్' (ప్రాయికముగ ప్రపంచమంతయు నేకకాలమున వ్యాపించు స్వభావముగలవ్యాధి) అను మూడువిధములుగ విభజించియున్నారు. ఈ విషూచికూడ పై మూడువిధములగు స్వభావములు గలదియనునట్లు "విషూచి" యను నామధేయమీ సాంక్రామికతను బోధించుచున్నది. దీనినుండివ్యాధులకుగల సాంక్రామికత్వజ్ఞానము పురాతనకాలమునుండియు ఆర్యులు దెలిసియున్నారనుట స్పష్టము. మరియు సాంక్రామికములను వాని వ్యాప్తినిగురించియు చరకమున విమానస్థానమందలి జనపదోధ్వంసనీయాధ్యాయమున గాననగును.

తృతీయ ప్రకరణము.

—) చికిత్సకు పూర్వము ఆచరింపదగిన నియమములు. (—

ఈ వ్యాధి గ్రామదేవతయున్ను గు క్షుద్రదేవతలయొక్క ప్రకోపమువలన జనించినదియని పిచ్చి నమ్మకములచేతను కొందరును, విరోధులగువారు చేయు క్షుద్రప్రయోగములు (బాణామతులు) మొదలగు నాభిచారికములవలన గలిగినదని మరి కొందరును, తలంచి సకాలమున చికిత్స జేయకయుందురు. మరి కొందరు నిర్లక్ష్యముచేతను వెనువెంట దగుచికిత్స జేయకయున్నారు. ఇంక కొందరు సమయమునకు దగువైద్యుని సాహాయ్యము పొందలేని స్థితిలోనున్నారు. ఇట్టివారి ననేకుల నిప్పటికిని మనము చూచుచున్నారము.

ముఖ్యముగా కలరావ్యాధి సోకినదని తెలిసినతోడనే రోగికి మిత్రులును భయమునుగల్గించక ధైర్యమును జెప్పవలెను. రోగిధరించు వస్త్రములు పడక మొదలగువానిని ముందు చతుర్థప్రకరణమున జెప్పబోవు ప్రకారము శుభ్రపరచియుంచవలెను. వెంటనే తగుచికిత్సకునకు దెలుపవలెను. ఒకవేళ చికిత్సకుడు అచ్చట లేక సమయమునకు తటస్థపడకున్నచో రోగియొక్క లక్షణముల బట్టి వ్యాధి యేస్థితియందున్నదియును పైగనబరచిన లక్షణముల నుండి తెలిసికొనవలెను. పిదప నీప్రకరణమున జెప్పినవిధముగ మందులను వానిమోతాదులను అనుపానక్రమములను గమనించి మిక్కిలి జాగ్రత్తతో నుపయోగించవలెను.

ఈవ్యాధికి సకాలమున దగుచికిత్స జేసినచో నూటికి నూర్గురును ఆరోగ్యమును బొందగలుగు. నేను గడచిన యిరువదియైదు వత్సరములనుండి విషూచీరోగుల కనేకులకు సకాలమునచికిత్స జేసి ఫలమునుబొందియున్నాడ. కొంతవరకు వ్యాధి ముదిరినపిదప జేయుచికిత్సలవలన ఫలమును విశేషముగ గాంచనేరము. వైద్యునిబుద్ధి కౌశల్యమునుండియు, త్రికాలవేదులగు మహర్షులచే ననుగ్రహింపబడిన యౌషధముల ప్రభావవిశేషమునుండియు, అంతిమావస్థయందును జేయుచికిత్సగూడ ఫలమును జూపును. అట్టిచికిత్సలనే నేననేకసమయముల జేసియున్నాడను. కాని వ్యాధి యేయవస్థయందున్నను చేయుచికిత్సయు సఫలంబగునని నమ్మదగదు. దీనిచే ప్రాథమికదశయందు చేయబడు చికిత్సలనుండి యెంతటిఫలమును గాంచగల్గుదుమో అంతటిఫలమును ఇతరావస్థల జేయుచికిత్సలచే గాంచనేరమనుట స్పష్టము. అనగా రోగారంభదశయందు చికిత్స జేసినచో నూటికి నూర్గురును స్వస్థతగాంచెదరు. ఇతరావస్థల జేయబడు చికిత్సలవలన నూటికి దాదాపు అరువదిమొదలు ఎనుబదివరకును ఆరోగ్యమును గాంచగలరని తలచెదను. గనుక "క్రియాకాలం న హాపయేత్" అను పూజ్యులగు వాగ్భటాచార్యులవాక్యమును స్మరింపుచు ప్రతిరోగమునందును తగినసమయమున చికిత్స జేయుట యావశ్యకము. విశేషముగ నిట్టిసాంక్రామిక వ్యాధులయందును త్వరపడుట ప్రధానకృత్యము.

మాయు — ... విశుద్ధోస్య క్రమాత్స్వతః॥
అని వాక్యములను బట్టి ... ఈవ్యాధి విషమునుబోలె నతితీవ్రము ... సరిసి చేయునది కావున నొక నిమిష కాలమైనను ఉపేక్షింపక శోధన చికిత్స జేయుట మంచిదగును, నువ్వాధి ... తానును సకాలమున చికిత్స జేయ ... శాస్త్రకారుల సిద్ధాంతము.


— ... —

శుద్ధిచేసిన ...	ఎండుమిరప కాయల చూర్ణము
తుంగముస్తల చూర్ణము	పచ్చకర్పూరము
కొండ ... పిప్పళ్ల చూర్ణము	

వీనిని సమభాగములుగ గొని యన్నిటి నొకటిగ జేర్చి ఖల్వమున నునిచి ... మెత్తగనూరి ... జేసి నీడ నెండించి మంచి గాజుసీసాలో నుంచవలెను. దీనిని రోగియొక్క వయోభేదమును వ్యాధిబలాబలములను గుర్తెరింగి తదనుసారముగ రెండేసిగంటలకొకసారి ... నుపయోగింపనగును. రెండు మూడు మోతాదులలో గుణము గల్గును.

— కస్తూరీకల్పనము. —

శుద్ధరసకర్పూరము	గోరోచనము
శుద్ధరససింధూరము	జాన్ను (ఆదివచ్చి ...)
శుద్ధయింగిలీకము	మిరియాలు
శుద్ధవసనాభి	కస్తూరి
పాపుదారు	నల్లమందు



వీనినన్నిటిని సమానభాగములుగ గ్రహించి యందు కస్తూరియు నల్లమందును దక్కతక్కిన వానినన్నింటిని ఖల్వమునను నునిచి చనుబాలుబోయుచు కాటుకవలె మెత్తనగువరకు నూరి బిళ్లగాచేసి యాబిళ్లను వెంటనే లేతరావియాకులమడతలో నునిచి సంప్రదాయము నెరింగి పుటపాకము జేయవలెను. పుటపాకము జేసినపిదప నందుండి బిళ్లను వెలికిందీసి బిళ్లకంటియుండు ఆకులను విడదీసి మరల ఖల్వమున వేసి మునుపటివలె చనుబాలుబోయుచు రెండుజాములు నూరునది. బిళ్లచేసి దానిని లేతరావియాకుల సంపుటమున బెట్టి మునుపటివలె పుటపాక మొనరింపవలెను. ఈరీతి నేడుసార్లు పుటపాకము జేయవలెను. పిమ్మట ఈద్రవ్యసముదాయమున జెప్పిన కస్తూరిని నల్లమందును కూడచేర్చి మునుపటివలె చనుబాలుపోయుచు నాలుగుజాముల కాలము కాటుకవలె మెత్తనగునట్లు నూరి పెసలగింజలంతేసిదైనను లేక కందిగింజలంతేసిదైనను మాత్రలుచేసి నీడనెండించి యుంచునది. ఈమాత్రలను రోగియొక్క వయోభేదమును రోగముయొక్క బలాబలమును ననుసరించి రెండేసిగంటలకొకమాత్రనైనను లేక రెండుమాత్రలనైనను మంచినీళ్ల యనుపానముతో నియ్యవలెను. కలరా వ్యాధియొక్క ప్రాథమికదశలో నీమందు నుపయోగించినచో నెవ్వరైన నపాయము జెందక సుఖమును గాంచుదురనుటకు సందియము లేదు. ఈయౌషధము కలరాను బోగొట్టునది యేగాక

చిరకాలమునుండి వేధించుచుండు గ్రహణిని అతిసారమును కూడ నివర్తింపజేయును. కలరావ్యాధిలో నొకప్పుడు మూత్రము విడువక యుండుటయు సహజముగ కల్గును. అట్టిసమయమున పైమాత్రలకు జెప్పిన ద్రవ్యములలో నల్లమందును మాత్రము విడిచి తక్కిన ద్రవ్యముల జేర్చి పైజెప్పిన ప్రకారము పుటపాకము బెట్టి మాత్రలజేసి, పైజెప్పినరీతి నుపయోగించినచో మూత్రము చక్కగ వెడలును. కలరావ్యాధిలో నేదశయందైనను ఈమాత్రల నుపయోగించినచో నమోఘముగు గుణమును కలుగజేయును.

—(విషూచికవటి.)—



అతివస	జాజికాయలు
తుంగముస్తలు	లవంగాలు
మాశీనవరుగు	శుద్ధిచేసిన గంజాయి
మామిడిపిక్క	ఎండిన మిరపకాయలు
కొడిసెపాలవిత్తులు	హారతికర్పూరము

పైజెప్పిన దినుసులలో కడపటి రెండు దక్కతక్కిన యెనిమిది ద్రవ్యములను ప్రత్యేకముగ నొక్కొకభాగముగను కడపటి రెంటిని రెండేసిభాగములుగను జేర్చి వేర్వేరుగ చూర్ణముజేసి యన్నిటిని నొకటిగ కల్వమునందునిడి గంజాయియాకు కషాయమునుబోయుచు లేక మంచినీళ్లనైనబోయుచు మెత్తనగునట్లు నూరి సెనగగింజలంతేసి మాత్రలజేసి నీడ నెండించవలెను.

ఈమాత్రలను వయోభేదమును వ్యాధిబలాబలమును ననుసరించి రెండుగంటల కొకతూరి నొకమాత్రవంతున నీళ్లతో నియ్యవలెను. ఈమాత్రలచే కలరా నివర్తించుటయేగాక చిరకాలమునుండి యనుబంధములుగనుండు వాతశ్లేష్మాతిసారంబులును గ్రహణీరోగంబులును నివర్తించును. రక్తాతిసార పిత్తాతిసారములయందుమాత్రము మిరపకాయలను కర్పూరమును విడచి తక్కినపదార్థముల నన్నిటిని జేర్చి పైజెప్పినరీతి గంజాయాకు కషాయముననూరి మాత్రలఁజేసి యుపయోగించునది.

—(విషూచీ నిషూదనరసము.)—

మిరపకాయలపొడి	తులం ౧	నల్లమందు	తులం ౧
హారతికర్పూరము	,, ౨	భీంసేనకర్పూరము	,, ౧

వీనిని పైజెప్పిన భాగముల ప్రకారము గ్రహించి ఖల్వమునందునిచి నిమ్మకాయలరసమును బోయుచు వారము దినముల వరకు చక్కగ నూరవలెను. పిదప రెండు లేక మూడు యవల పరిమితి గల్గునట్లులు మాత్రలుజేసి నీడనెండించి మంచి గాజు సీసాలో భద్రముగనునిచి యుంచవలెను. ఈమాత్రలను వ్యాధిబలమున కనుగుణముగ గంట కొకమాత్రవంతున నుపయోగించవలెను.

—(విషూచీ కాలానలము.)—

ఇంగువ	మిరపకాయలపొడి
హారతికర్పూరము	నల్లమందు

వీనిని సమానభాగములుగ గ్రహించి మంచి తేనె బోయుచు మూడు దినములు చక్కగ మర్దనముజేసి నాల్గు యవల పరిమాణముల మాత్రలజేసి భద్రముగ నుంచునది. ఈ మాత్రలను రోగియొక్కయు రోగముయొక్కయు బలాబలముల ననుసరించి రెండేసిగంటల కొకమాత్రవంతున నీటితో నుపయోగించునది. మూలమొత్తాదుల నుపయోగించునంతలో చక్కని గుణము గల్గును.

—॥ అజమోదావటి. ॥—

మంచిక్రొత్తయోమమును పరిశుభ్రముగ రాళ్లు దుమ్ము మొదలగునవి లేకుండ చక్కజేసి పనిరెండురూపాయలయెత్తుకు తక్కువ లేకుండ గ్రహించి దానిని యొకమట్టిమూకుటిలోనునిచి పొయిమీదబెట్టి సన్నగ మంటబెట్టి దోరగవేయించి వేగిన పిదప దానిని వేడిగనున్నపుడే ఖల్వమున నునిచి వేడితగ్గునంతలో మెత్తగా నూరవలెను. మెత్తగా నలిగినపిదప మరల మూకుటిలోవేసి మాడకుండునట్లు మునుపటివలె వేయించవలెను. దానిని వేడిగనె ఖల్వమునసునిచి మునుపటివలె నూరవలెను. ఈప్రకారముగ ఆరేడుతడవలు నూరినచో ఓమము నల్లగ నిగనిగలాడుచు చమురును గక్కుచు ముద్దయగును. అట్లు ముద్దగునమయమున పనిరెండురూపాయల యెత్తుగల యోమమునకు నాల్గురూపాయల యెత్తుగల హారతికర్పూరమును పైముద్దలోజేర్చి మెలకువతో మెత్తగనూరి కుంకుడు

గింతలం తేసి మాత్రలఁజేసి భద్రముగా నుంచునది. ఈమాత్రలను వయోభేదమును వ్యాధిబలాబలములను గమనించి తదనుసారముగ నుపయోగింపవలెను. దీనివలన కలరా నివర్తించుటయేగాక చిరకాలమునుండి వ్యాపించియుండు అజీర్ణమును నగ్గిన విరేచనములను గ్రహణులనుగూడ నియ్యది నివర్తింపఁజేయును.

మరిచాదివటి.

మిరియాలు	హారతికర్పూరము
జిల్లేడువేరుల పైపొప్పర	ఓమము

ఈనాల్గిటిని ప్రత్యేకము నూఁజేసి తులములవంతున గ్రహించి చూర్ణముచేసి యొకటిగ ఖల్వమున నునిచి యుల్లిరసమును బోయుచు రెండుమూడుదినములు నూనెగునట్లు నూరి సెనగ గింజలవలె మాత్రలఁజేసి నీడనెండించి సీసాలో నుంచుకొనవలెను. ఈమాత్రలను వ్యాధివయోబలాబలములను పరిశీలించి తదనుసారముగ రెండుగంటల కొకసారియైనను మూడుగంటల కొకసారియైనను నీటియనుపానముతో నియ్యవలెను. మూడు నాల్గు మోతాదుల నుపయోగించినచో విషూచి నివర్తించును.

విషూచీ గజకేసరి.

నీడనెండించిన పుదీనాఆకుపొడి	నేతిలోవేగిన యింగువపొడి
హారతికర్పూరము	ఎండు మిరపకాయలపొడి

వీనిని ప్రత్యేకము మూఁజేసి తులములవంతున జేర్చి అందు నల్లమందు నొకతులమును కలిపి యీనాల్గిటిని ఖల్వమునసుంచి

పుదీనాఆకు రసముననూరుచు మాత్రల కనుకూలమగునట్లు నాల్గు దినములు మర్దనము జేసి కందులవలె మాత్రల జేయవలెను. వానిని నీడ నెండించి మంచిగాజుకుప్పెలో నుంచునది. ఈమాత్రలను వ్యాధియొక్కయు రోగియొక్కయు బలాబలముల ననుసరించి ములకునకో తడవకొకటి లేక రెండు మాత్రలనంతున నీళ్లయనుపానమున నుపయోగింపనగును. మూడునాల్గు మోతాదుల నుపయోగించునంతలో విషూచి శమించును.

కర్పూరాదివటి.

పచ్చకర్పూరము తు. ౧	దాల్చినిచెక్క తు. ౪
నల్లమందు తు. ౧	గవ్వపలుకుసాంబ్రాణి తు. ౪
కుంకుమపువ్వు తు. ౧	తుంగముస్తలు తు. ౨

ఈ వస్తువులను పైజెప్పిన భాగముల ప్రకారము గ్రహించి ఖల్వమున నునిచి నీళ్లనైనను పుదీనాఆకు కషాయమునైనను నూరుచు మెత్తగనూరి కందులవలె మాత్రలజేసి నీడనెండించి సీసాలో భద్రముగనుంచునది. ఈమాత్రలను వ్యాధి బలాబలముల ననుసరించి రెండుగంటల కొకమాత్రవంతున నీటి యనుపానముతో సేవించినయెడ విషూచి యతిశీఘ్రముగ నివర్తించును.

ఖదిరసారవటి.

కాచు	ఓమము
మామిడికాయ	కర్పూరము
చిన్నకరక్కాయలు	శుద్ధిజేసిన ఇంగిలీకము

వీనిని ప్రత్యేకము ఒకతులమువంతున గ్రహించి చూర్ణముచేసి ఖల్వమునవైచి నిమ్మపండ్లరసమునుబోయుచు మెత్తనగువరకు నూరి రెండుగురిగింజలంత మాత్రలజేసి నీడ నెండించి భద్రముగ నుంచునది. ఈ మాత్రలను ఘంటకొకసారి నీళ్లలో జేర్చి యిచ్చినచో వాంతిభేది నిలుచును.

—॥ రసభస్మప్రయోగక్రమము. ॥—

ఇంగిలీకమునుండి తీయబడిన రసముచే నండబడిన రసభస్మమును భాండవకర్పూరమును సహజముగ నాంధ్రదేశమునగల వైద్యులు మిక్కిలి నేర్పుతో వాడుట సర్వజనవిదితము. ఈ రసభస్మమును కలరాయందు నుపయోగించుట యుచితము. మనవారలు వ్యాధిబలాబలములను రోగిప్రకృతిని చక్కగగమనించి తగినప్రమాణమును గల్పించి యుపయోగింపక తమకు దోచినట్లు నుపయోగించుటచే నత్యాది విపరీతముగ పరిణమించును. దానం జేసి పండ్లూడుట నోరు పుండగుట మున్నగు బాధలుగల్గుచున్నవి. అట్లుగాక రోగియొక్కయు వ్యాధియొక్కయు బలాబలముల జక్కగగమనించి కలరావ్యాధియందు ఒక యవ (౧ గ్రైను) మొదలు పది యవ (౧౦ గ్రైను) ల పరిమితివరకు మోతాదుల గల్పించి మాత్రలుగాజేసి యామాత్రలను మంచిగోధుమపిండితోనైనను లేక శుంఠి మిరియములతోనైనను చక్కగ మాటుబెట్టి రెండు గంటలకొకతూరి యుపయోగింపవలెను.

లేక ముఖరోగాది పాన్పుతులచొత్తును ఏడెనిమిదిమాత్రల జేసి మాత్రకుమాత్రకు గంటకొకమాత్రను క్రమముగ మింగించవలెను. ఇయ్యది విశేషముగ కలరాయందు గుణకారియగు నౌషధరాజము. సుకుమారులకును గర్భిణీస్త్రీలకును భయపడు స్వభావముగలవారికిని దీనిని యోగింపజనదు. మరియు దీనిని వైద్యవిశారదులు సమయభేదములు కనిపెట్టి యుపయోగింపవలెను. గాని యందరును వారివారి యిచ్చవచ్చినట్టులు ప్రవర్తించుట మిక్కిలి యనర్థకరమగునని యెఱుంగునది.

—{ శీతకాదికషాయము. }—

లవంగాలు ఆవాలు

ఓమము మిరియాలు

వీనిని ప్రత్యేకము ఒకతులమునంతున గ్రహించి యన్నిటిని మూటగట్టినుంచి పొయిమీద బెట్టి సన్నపుసెగను మూడు భాగములు విరుగునట్లు వేయించి యందు ఒకసోలెడు నీళ్లు పోసి మూతమూసి యొకపొంగువచ్చునందాక కాచి మంచి పాత్రలోనికి వడగట్టియుంచునది. దీనిని విషూచివ్యాధి ప్రారంభదశయందు రోగికి రెండుగంటలకొకసారి యొకగుక్కెడు (ఒక ఔన్సు) నంతున మూడునాల్గు మోతాదుల నియ్యవలెను. కలరావ్యాధి నిశ్శేషముగ నివర్తించును.

—{ వసాదికషాయము. }—

దోరగవేయించిన వస పలం. ౨ దోరగవేయించిన పచ్చిబియ్యపు
దోరగవేయించిన యొండుమిరప పిండి పలం. ౨
కాచుల పొడి పలం. ౨ ముదురు మారేడుకాయ పలం. ౨

వీనినన్నింటిని పైజెప్పిన భాగభేదములచే గ్రహించి యందు నాల్గుశేర్లు తరవాణినీళ్లు (కలినీరు) పోసి నాల్గవపాలుమిగులు నట్టులు కాచి వడియగట్టి యీకషాయమును రెండుగంటల కొకతూరి తడవకు అరగ్లాసెడునంతున ఇయ్యవలెను. రెండు మూడుమోతాదులలో విషూచి నివృత్తించును.

—{ భృంగరాజనస్యము. }—

విషూచియందు స్మారకములేక యుండునప్పుడు గుంట కలగరాకు పసరును రెండుముక్కులలో నైదేసిబొట్లు విడువ వలెను. ఇట్లు రెండుమూడుతడవలు అవసరమునుబట్టి నస్యము జేసిన మైకము తగ్గును. విషూచి గుణమగును.

—{ చించాదినస్యము. }—

త్రికటుకము (శొంఠిపిప్పలిమిరియము)ల చూర్ణమును సైంధలవణమును చింతాకురసములోకలిపి రెండుముక్కులలోను ఐదేసిబొట్లు విడువవలెను. దీనినుండి మూర్ఛయు విషూచియు నిలిచిపోవును. ఇయ్యది సుకుమారులకును బాలులకును వృద్ధు లకును గర్భిణీస్త్రీలకును నుపయోగింపంజనదు.

—{ కరంజాద్యంజనము. }—

కానుగవిత్తులపప్పు, శొంఠి, పిప్పళ్లు, మిరియాలు, పసుపు, వీనిని సమభాగములుగ గ్రహించి మాదీఫలరసముచే చక్కగ నాలుగైదుదినములును మెత్తగనూరి కణికలుగజేసి నీడ నెం డించి యుంచవలెను. విషూచియందుకలుగు మత్తునందు కణి

కలను మాదీఫలరసములో నైనను నిమ్మకాయరసములో నైనను సానమీద నరగదీసి కంఠములో కందిగింజంత వేయవలెను. దీని నుండి మూర్ఛయు విషూచియందు కల్గు నుపద్రవంబులును తగ్గును. దీనిని సుకుమారులకును గర్భిణీస్త్రీలకును ఉపయోగింపకూడదు.

—॥ వమనకార్య. ॥—

విషూచియందు కడుపుబ్బరంబును వాంతులును అధికముగనున్నపుడు గోరువెచ్చని వేడినీటిలో కొంచ ముప్పుకలిపి యిచ్చిన వాంతియగును. దీనిచే కడుపునందలి దోషమంతయు బైటికి వెడలును. వాంతులు తగ్గును. ఇయ్యబడుమందులు శీఘ్రముగ గుణాకరములగును. ఈప్రక్రియనుమాత్రము మిక్కిలి జాగరూకతతో సమయమును నెరింగి వైద్యులు ఉపయోగింపవలెను.

—॥ వాంతులు నిలుపుటకు చికిత్సలు. ॥—

—॥ సర్షపలేపము. ॥—

కలరావ్యాధియందు వాంతులు విశేషముగ నగుచున్నచో ఆవాలను పిండిజేసి నీళ్లుబోసి మెత్తగనూరి రెండువ్రేళ్ల వెడలుపును ఆరంగుళముల నిడివియుకల యొక తెల్లని గుడ్డకుపూసి బొడ్డుదగ్గరనుండి రొమ్ముకు పైవరకు పట్టీవేయవలెను. ఆపట్టీవలన విశేషముగ మంటబుట్టినచో తీసివేయునది. దీనిని సుకుమారులకును గర్భిణీస్త్రీలకును ఉపయోగింపదగదు.

—॥ మంచుగడ్డయుపయోగము. ॥—

వాంతులు నిలువక అప్పటప్పటికిని విశేషముగ నగుచుండ నేని మంచుగడ్డ (అయిస్) ను చిన్నముక్కలుగా జేసి అప్పుడప్పుడును తినిపించుట మంచిది. మరియు లోపలి కుపయోగింపబడు మందులతోడను గంజిమొదలగు నాహారద్రవ్యములతోడను దాహమున కుపయోగించు నీటితోడను మంచుగడ్డముక్కలను జేర్చి యుపయోగించుట చాలమంచిది.

—॥ కాయోపయోగము. ॥—

లేత పైడిపత్రికాయలను తేనెతోనైనను నిమ్మకాయ రసముతోనైనను సానమీద నరగదీసి యాగంధమును కొంచెముగ తేనెతో కలిపి యప్పుడప్పుడును ఇచ్చుచుండుట మంచిది. లేక నాలుకకు వ్రాయుచున్నను వాంతి నిలుచును.

—॥ మాదీఫలయోగము. ॥—

మాదీఫలరసమునకు రెండుభాగములు పంచదారను కలిపి తేలికగా పాకముపట్టి యద్దానిని కొంచెము కొంచెముగ నాలుకకు రాయుచుండిన దుర్ఘటములగు వాంతులును నెక్కిళ్లును దప్పియు తగ్గును.

—॥ మయూరపింఛాదియోగము. ॥—

నెమలియీకెలు, ఏలకిగింజలు, ఉసిరికెకాయలలోనిపప్పు, రేగుగింజలలోనిపప్పు, బెల్లనిపట్టుగుడ్డ, వీనిని సమభాగములుగ గ్రహించి మంచి మూకుటిలోనునిచి నిప్పుసెగలో మొల్ల

మెత్తగా నూఁగగనూరిచి దానిని వేడిగనుండునప్పుడే కల్వమున నునిచి నౌషధముగా నూరి వస్త్రగాలితముచేసి సీసాలో భద్రము చేయునది. దీనిని వాంతుల ప్రాబల్యము ననుసరించి నెడెన రెండు గురుగింజలంతమాత్రము తేనెతోనైనను నిమ్మకాయల పచ్చితోనైనను కలిపి నాలుకకు పలుమారు రాయుచుండవలెను. ఘోరమగు వాంతులు తగ్గును.

—{ మాదీఫలాంగాదియోగము. }—

మాదీఫలములతోలును మూకుటిలో నునిచి దోరగ మాడ్చి మెత్తగ పొడిచేసి నాలుగైదు గురిగింజలయెత్తు మాదీ ఫలముల పానకముతోగాని తేనెతోగాని కలిపి అరగంట కొక మారు నాలుకకు పూయుచున్నచో వాంతులు తగ్గును.

—{ ఏలాదిచూర్ణము. }—

ఏలకులు, నాగకేసరములు, లేగుగింజలలోపప్పు, వరి పేలాలు, తుంగగడ్డలు, మంచిగంధము, పిప్పళ్లు, వీనిని సమ భాగములుగ గ్రహించి మెత్తగ పొడిచేసి యుంచుకొనునది. ఈచూర్ణమును కొంచెము తేనెను చక్కెరను కలిపి వ్యాధి బలమునుబట్టి యొకపలకి అయిదు యవలు మొదలు పది పదునైదు యవల ఎత్తువరకు ఇయ్యనగును. వాంతులు తగ్గును.

—{ ఏలాదికషాయము. }—

నీళ్లతో కూడ మెత్తగా నలియకొట్టబడిన జీలకఱ్ఱను, ఏలకికాయలను వేర్వేరుగనైనను రెంటిని చేర్చియైనను ఒక

పాత్రలో నుసిచి యందు నాల్గుభాగములు నీళ్లుపోసి నాల్గవ పాలు మిగులునంతవరకును కాచి వడబోసి చల్లార్చి యా కషాయమును అప్పుడప్పుడును కొంచెము కొంచెముగ నియ్య నగును. వాంతులు నిలచును.

—॥ దాడిమయోగము. ॥—

పుల్లదానిమ్మపండ్ల రసమునకు గట్టింత పంచదారనైనను పటికబెల్లమునైనను వేసి పాగుపట్టి కాగి చల్లారిన నీటితో కలిపి మాటిమాటికి నిచ్చుట మంచిది. దప్పియు వాంతులును తగ్గును.

—॥ బిల్వమూల కషాయము. ॥—

మారేడువేళ్ల కషాయమున కొంచెము తేనెకలిపి యిచ్చిన-చో తీవ్రములగు వాంతులు మానును.

—॥ ఉశీరాది కషాయము. ॥—

వట్టివేళ్లు, నేరేడుచిగుళ్లు, మామిడిచిగుళ్లు, దనియాలు, కురువేరు, ఈద్రవ్యములను అన్నిటినైనను కొన్నిటినైనను సమభాగములుగ గ్రహించి యొకకుండలో నుసిచి వస్తునము దాయమునకు ఎనిమిది భాగములు నీళ్లుపోసి యొకటి రెండు పొంగులువచ్చునట్లు కాచి చల్లార్చి కావలసినపుడు ఆచల్లని కషాయమును దీసికొని యందు ఏలకులచూర్ణమునైనను పాదిరి పువ్వులనైనను వాసనకై కొంచెముగ వైచి కొంచెము తేనె జేర్చి కొంచెముకొంచెముగ లోనికిచ్చినయెడ వాంతులుతగ్గును.

—| [illegible] పానీయము. |—

మఱ్ఱిచిగుళ్లను మామిడిచిగుళ్లను సమభాగముగ గ్రహించి ద్రవ్యములను ఎనిమిదింతలు నీళ్లుబోసి యొకటి రెండు పొంగులు వచ్చునంతవరకు కాచి వడియగట్టి చల్లార్చి అప్పుడప్పుడును కొంచెముకొంచెముగ నిచ్చుచుండిన వాంతులు తగ్గును.

—| [illegible] పానీయము. |—

గసగసతులములు సీమసు, రెండుతులములు ఏలకిగింజలు, గసగసతులములు నిమ్మకాయలు, పిసిని మూకుటిలో నుంచి నిప్పు సెగమీద బెట్టి దోరగ మాడుసమయమున నొక సేరునీళ్లను మూకుటిలోబోసి వెంటనే మూత సిడవలెను. ఒకపొంగు వచ్చినమీదట దించి వడియబోసి చల్లార్చి యాకషాయమును కొంచెముకొంచెముగ నిచ్చిన వాంతులు తగ్గును.

—| తండులోదకాదిపానీయము. |—

బియ్యపునూకలను ఉసిరికెకాయ గింజలలోని పప్పును ప్రత్యేక మొక్కొక్కపలమును గ్రహించి దోరగమాడ్చి యందు దాక నీరు నిల్లుపోసి యొకపొంగు వచ్చునంతవరకు కాచి వడియగట్టి చల్లార్చి యాసిటిని కొంచెము కొంచెముగ నిచ్చుచుండవలెను. వాంతులు నిలుచును.

—| లాజపానీయము. |—

మూడు తులముల వరిపేలాలు రెండు శేర్ల నీళ్లలోకలిపి వకటి రెండు పొంగులువచ్చునట్లు కాచి వడియకట్టి యందు

కొంచెముగ నుప్పువేసి కలిపి మాటిమాటికిని యిచ్చుచుండవలెను. వాంతులు నిలుచును. రోగికి బలము కలుగును.

—: జీరకపానీయము. :—

జీలకఱ్ఱను చనుపాలలోనూరి వడియగట్టియైనను లేక వట్టి చనుబాలనైనను మాటిమాటికి త్రాగించుట మిక్కిలి యుక్తముగనుండును. దీనివలన వాంతులు తగ్గుటయేగాక వెక్కిళ్లు మొదలగు నుపద్రవములుకూడ మానును.

—: మృత్ఖండపానీయము. :—

పాటిమట్టిగడ్డ, పాతకుండపెంకు, నల్లని యినుక పిసినిలో నెద్దానినైనను నిప్పులలో నెఱ్ఱనగునట్లు కాల్చి నీళ్లలోవైచి యానీళ్లనువడియగట్టి చల్లార్చి యిచ్చుచుండిన దప్పియు వాంతులును మానును.

—: వెక్కిళ్లు వానిచికిత్స. :—

కలరావ్యాధియం దుపద్రవరూపముగ వెక్కిళ్లు గల్గును. ఈవ్యాధియందుకల్గు నుపద్రవములలో నియ్యది మిక్కిలి క్రూరమైనది. అట్టి యుపద్రవము కల్గినమాత్రముననే వ్యాధియొక్క యంతిమదశయని నిశ్చయించి యనేకులు చికిత్సల జేయుటమాని నిరాశజెందుదురు. వెక్కిళ్లు ప్రాయికముగ నీవ్యాధియొక్క యంతిమదశను సూచించునది యనుట నిక్కమే. అయినను అందును భేదములుగలవు. కావున జ్ఞానవంతులగు వైద్యులు వ్యాధిదశను నిశ్చయించునంతవరకును చికిత్సల మానుట పిచ్చితనము.

—(కీటమృద్యోగము.)—

కందిరీగ గూడును దెచ్చి యందు కందిరీగ రెక్కలు మలము మున్నగునవి లేకుండ శుభ్రము జేసి మెత్తగనూరి నాలుగైదు గురిగింజలయెత్తు మోతాదులు తేనెతోనైనను మంచినీళ్లతోనైనను కలిపి ఇయ్యవలెను. రెండుమూడు మోతాదుల నుపయోగించునంతలో క్రూరములగు వెక్కిళ్లు నివర్తించును.

—(అజాజీయోగము.)—

జీలకఱ్ఱ, పటికబెల్లము, లేక బెల్లము, ఈవస్తువుల సమభాగములుగ జేర్చి తేనెతోనూరి చిన్నయుండలుగ జేసి యాయుండల పుక్కిట నిడికొని దాని రసమును మ్రింగుచుండిన వెక్కిళ్లు నిలచును. అట్లు పుక్కిటనుంచుకొనుటకు తగిన శక్తిలేనిసమయమున పైజెప్పిన యుండలను చల్లని నీటిలో కొంచెముగ కలిపి లోపలికి త్రాగింపందగు. లేక కొంచెముగ తేనెతోకలిపి తినిపించవలెను.

—(మిరియపుగుటికలు.)—

మిరపకాయలపొడి ప. ౧. బెల్లము ప. ౪. ఈరెండిటిని చేర్చి మెత్తగా కల్లియునూరి గురిగింజలవలె మాత్రలజేసి సమయమునెరింగి యొకటి రెండుతడవలు తేనెయనుపానముతో నిచ్చునంతలో వెక్కిళ్లు మానును. ఇయ్యది సుకుమారులకును గర్భిణీస్త్రీలకును ఇయ్యదగదు.

—(నిశాధూమము.)—

పసుపుపొడిని ఒక కాకితములోబోసి చుట్టచుట్టి చుట్టను కాల్చువిధముగ పొగను పీల్చినచో వెక్కిళ్లు మానును.

—॥ ఏలాదిధూమము. ॥—

ఏలకులపొట్టు, పట్టుగుడ్డ, పాతగోనె దింపి, పెసలపొట్టు, వీనిని పైని జెప్పినరీతిగ చుట్టజుట్టి పొగ పీల్చినచో వెక్కిళ్లు నివృత్తించును.

—॥ జీరకాదిపానీయము. ॥—

జీలకఱ్ఱ, పుల్లదానిమ్మగింజలు, ఈ రెండిటిని సమముగ జేర్చి నలుగగొట్టి నాలుగింతలు నీళ్లుబోసి కాచినదియగట్టి చల్లార్చియిచ్చినచో వెక్కిళ్లుమానును.

—॥ కార్పాసపానీయము. ॥—

పత్తిగింజలలోని పప్పును నలకిగింజలను సమముగ జేర్చి నాల్గుభాగము లధికముగ నీటితో గలిపి కషాయముకాచి వడియ గట్టి చల్లార్చి యందు పటికిబెల్లమును కొంచెముగ జేర్చియిచ్చిన వెక్కిళ్లు మానును.

—॥ బిల్వాదిపానీయము. ॥—

పచ్చిగనుండు మారేడు వేరుపైబరడు— లేక దానియూరు ఏలకులు, నాగకేసరములు, దాచినిచెక్క, వీనిని సమభాగ ములుగ జేర్చి నలుగగొట్టి నాలుగింతలు నీళ్లుపోసి కషాయము కాచి నాల్గవపాలు మిగిలియుండగ దించివడియగట్టి చల్లార్చి. భద్రముగ నుంచునది. ఈకషాయమును కొంచెము కొంచె ముగ నిచ్చినచో వెక్కిళ్లు మానును.

వేయించబడిన పాతబియ్యము పలములు. ౧. పచ్చి మారేడాకు పలములు. ౫. ఈ రెంటిని రోటిలోనునిచి దంచి

యూవరూ చేయానను నానబోసి బియ్యమునుమాత్రము ఒక నీరు పిండివేసి చిముకళ్ళ గింజ పొంగులువచ్చునంతకు కాచి వడియగట్టి యిచ్చుచుండిన యెక్కిళ్ళ ప్రకారములగు వెక్కిళ్లు మానును.

మంచినీళ్లగల చెరువుల సమీపమునను, లేక కాలువ గట్టులయందైనను వరిచేలగట్టులయందైన నుండు పీత బొక్క లలోని నీటిని దెచ్చి వడియగట్టి కావలసినపుడెల్ల కొంచెముకొం చెముగ త్రాగించినచో ఘోరములగు వెక్కిళ్ళు నిమ్మళించును.

— తృష్ణ (దప్పి.) —

కలరావ్యాధియందు దప్పికూడ బలిష్ఠమైనయుపద్రవము. ఈయుపద్రవము కలరావ్యాధి వృద్ధినొందుకొలదియు శరీరము నందలి ద్రవ్యములగు ద్రవధాతువులుతగ్గి నోటనీటియూటతగ్గు చు నెండియారుటవలన గలుగును. క్రమముగ నాలుకయందు తడి కొంచెమైనలేక తాటిపట్టయంచులవలె గరగరలాడుచుండును. ఈలక్షణము లధికములగుకొలది దప్పి యోర్వ శక్యముగాక యెన్నినీళ్లు త్రాగినను శమించక వృద్ధియగుచుండును. అట్టిదప్పి కలిగినపుడు సహజముగ మనవారలు గుక్కెడు నీళ్లనిచ్చినను అయ్యది విశేషముగ శీతలముం జేయుననియు ప్రమాదజనక మనియు తలంచి జలమును కొంచెమైన నియ్యరు. * తృష్ణానిరో

* “తృష్ణాయాం ప్రాణదయాత్రాణో న లభేతతులం యది। మరణం దీర్ఘరోగం వా ప్రాప్నోతి తృషితో నరః। తృషితో మోహమాయాతి మోహాత్ప్రాణాన్ విముఞ్చతి। తస్మాత్సర్వాస్వవస్థాసు న క్వచిత్ వారి వార్యతే” యుండదమాధవను తృష్ణాచికిత్స.

ధముచే (దప్పి వేగమును అడంచుటచే) గల్గు నుపద్రవముల దెలియక మనవారు మూఢులై జలము నియ్యకుండుటంజేసి యనేకసమయముల రోగులకు దీర్ఘవ్యాధులు గల్గుటయేగాక యొకసమయమున ప్రాణహానియు గల్గుచున్నది. కావున దప్పి కల్గకుండ కాపాడుట ప్రథమోద్యమము. అంతనిలువక దప్పిక గ నేని తోడనే దానినడంప చల్లనినీటికి సమమగునది వేరొండు లేదు. మంచినీళ్లలో నట్టివేరు పాదిరిపూవులు మొదలగు ద్రవ్యములకలిపి యియ్యనగును. నీటియందు మంచుగడ్డను వైచి యియ్యవచ్చును. సోడా మొదలగు పానీయముల నియ్య నగును. తరవాణినీళ్ళు (కూటినీళ్ళు-పుల్లనీళ్ళు) ఇచ్చుట మంచిది. ఈ నీటియందు పంచదార నిమ్మకాయలరసమునుకలిపిగూడనిచ్చుట యుచితము. పైవానిలో కూటినీటితో సమానమైనది వేరు లేదు.

—॥ దప్పి తగ్గుటకు చికిత్స. ॥—

—॥ తక్రపానీయము. ॥—

పలుచని నీటిమజ్జిగను పెరుగుమీఁద తేటనీరును అప్పు డప్పుడు ఇచ్చుచుండుట మంచిది. ఇందు అవసరమున్నచో కొంచ ముప్పును కొంచము నిమ్మకాయరసమును కూడచేర్చి యిచ్చుటయు మంచిది. దీనినుండి క్రూరమగుదప్పియు వాంతు లును తగ్గును.

—॥ నింబపానీయము. ॥—

లేత వేపచిగుళ్లను నాలుగింతల నీళ్లలోవేసి రెండు మూడు పొంగులు వచ్చునంతవరకు కాచి వడియగట్టి చల్లార్చి యిచ్చుచుండిన దప్పి యణంగును.

—(ముద్గపానీయము.)—

సుగంధితులములు పేసను అరసేరు చల్లనినీటిలో కలిపి కొంచెముగాకొంచెముగ నిచ్చుచుండిన దప్పి తగ్గును. లేక కావలసినంతమాత్రము మొక్కసారిగ నిచ్చినను వాంతియు దప్పియు నడంగును.

—(ఖర్జూరాదిపానీయము.)—

ఖర్జూరపుకాయలైనను అతిమధురములైనను పర్పాటకిమ్మునైనను రెండుతులములు తెచ్చి యొకసేరునీళ్ళు వేసి యొకటి రెండు పొంగులు వచ్చువరకు కాచి చల్లార్చి యానీటిని దప్పి తగ్గునంతవరకు కొంచము కొంచము ఇయ్యవచ్చును. దప్పి నయమగును.

—(తండులపానీయము.)—

బియ్యపుకడుగు (బియ్యము ఉడుకుట కారంభించునపుడు వేడిగ గాగియుండును) నీటిలో కొంచెముగ నిమ్మకాయరసమును ఉప్పును కలిపి దప్పి యణంగువరకును కొంచెము కొంచెముగ నిచ్చుటచే దప్పితీరును.

—(హిమాంబుపానీయము.)—

మంచుగడ్డ దొరకినచో ముక్కలంజేసి కొంచెముకొంచెముగనిచ్చుచుండుట చాలామంచిది. మంచుగెడ్డనిచ్చిన శీతలము గ్రమ్మునని మనవారు చాలాభయపడుదురుగాని యొకప్పుడును అటుగానేరదు. యిక్కలి ధైర్యముతో సంశయింపక ధారాళ

ముగనుపయోగింపనగును. క్రూరమగు దప్పి శాంతులు మాయ
మగును.

—॥ ద్రాక్షాదిగండూషములు. ॥—

ద్రాక్షపండ్లరసము, చెరకురసము, తేనె, బెల్లము—
లేక పంచదారపానకము, తేటనగు చింతపండు పులుపుసిరు,
పుల్లనైయుండు దానిమ్మ మొదలగువానిరసము, సీసిలో దేసి
నైన కొంచెముగ నోటనుంచుకొని నాలుగ్గుమతెసవలు గిండూ
షముచేసినచో మిక్కిలి క్రూరమగు దప్పితగ్గును. లేక పైజె
ప్పిన పండ్లరసమును కొంచెముగ సీటిలోకలిసియు సిచ్చిన దప్పి
నెమ్మదిసెందును.

రోగి కోరునప్పుడెల్ల వట్టిచలిసిళ్లనుమాత్రము నియ్యం
జనదు. పైజెప్పినరీతిగ సంస్కారముచేసి యుపయోగించునెడ
వ్యాధిబలముతగ్గి త్వరలో స్వస్థపడగును.

—॥ చలవ గ్రమ్ముట దానిచికిత్స. ॥—

కలరావ్యాధియందు శరీరమంతయు అల్లికలవ కాడలవలె
చల్లబడుట యొక లక్షణమైయున్నది. ఈ చలవ ముందుగ
కాళ్లయందైనను చేతులయందైనను లేక రెంటియందైనను
ప్రారంభమయి పిమ్మట శరీరమునందెల్ల వ్యాపించును. ఇయ్యది
శరీరమునందలి రక్తముయొక్క బలము క్షీణించుట వలన
కలుగును. చలువ కనుపించినప్పుడనే తగుచికిత్స జేసినచో
వెంటనే తగ్గును. ఉపేక్షించినచో క్రమముగ శరీరమునందెల్ల

వ్యాపించును. కావున శీతలము శరీరమునందెల్ల వ్యాపించి నాడి క్షీణించకమునుపే తగుచికిత్సకుని యనుమతిచేనైనను స్వయముగనైనను నైవ్యాధి మూలమునన్నైనను త్వరితముగ చికిత్సంజేయ యత్నించుట ముఖ్యకర్తవ్యము.

—॥ కస్తూరిప్రయోగము. ॥—

పైజెప్పినరీతిగ చలువ క్రమ్మినపుడు తోడనే శరీరమున నిక్కటముగ చెమటగారును. మూత్రముతగ్గును. నాడి క్షీణదశనొందును. అట్టి దుర్గుణములమాన్పి చలువను పోగొట్టుటకై కస్తూరివంటి పదార్థము వేరొండులేదని దృఢముగ జెప్పవచ్చును. కావున కస్తూరిని రోగియొక్కవయస్సును వ్యాధిబలమును అనుసరించి తడవకు అరగురిగింజయెత్తు మొదలు రెండుగురిగింజలయెత్తువరకు తేనెతోనైనను చనుబాలతోనైనను కలిపి ఇయ్యవలెను. మద్యపానమలవాటుగా నున్నవారికి కొంచెము బ్రాందితోనైనను మంచిసారాయితోనైనను కలిపి ఇచ్చుటమంచిది. చలువ తగ్గునంతవరకును గంటకొకసారి ఇచ్చుచుండిన క్షీణించిన నాడికి బలముకలిగి శరీరమునకు సమమగునుష్ణమును కలుగంజేయును.

—॥ కస్తూర్యాదిఘటి. ॥—

కస్తూరి, కుంకుమపువ్వు, శుద్ధిచేసిన వత్సనాభి, జున్ను, పావుదారు, గోరోచనము, మిరియాలు, వీనినన్నిటిని సమభాగములుగ గ్రహించి కస్తూరిగాక తక్కినవానిని చిత్రమూ

లవు రసముతో నాలుగైదు దినములు కాచుకవలె మెత్తనగు నట్లునూరి పిమ్మట కస్తూరిని చేర్చి బట్టివరగోగుకషాయముగాని నైనను చిత్రమూలపు స్వరసమును గోస్తనైనను అయిదారు దినములునూరి పెసలవలె మాత్రలం జేసి నీడ నెండించి సీసాలో భద్రముగ నుంచవలెను. ఈ మాత్రలను వయోభేదమును రోగబలమును జూచి తడవ కొకటిమొదలు మూడునాల్గు మాత్రలవరకు తేనెలోచాది యియ్యవలెను. ఈరీతి నొసగుచు కొంతమూరిపంతమున శీతలముతగ్గి నాడికిబలము గల్గువరకు ఇచ్చు చుండవలెను.

చలువగ్రమ్మి నాడి క్షీణించి విరేచనము లగుచున్న పైనుదహరించిన 'కస్తూరీకల్పరసము' ఉపయోగింపనగును.

చలువతగ్గక నాడిక్షీణించి యున్నయెడల "గరళ కాలకూటము" "సింహప్రతీపానలము" "వాతగజాంకుశము" అను సిద్ధౌషధములను తగిన వైద్యసహాయమును బొంది యుపయోగించిన మిక్కిలి గుణకారిగనుండును

—॥ చలువకు బాహ్యోపచారములు. ॥—

—॥ శ్రుత్యాగాదిలేపము. ॥—

మునగచెక్కను చక్కగా పొడిచేసి దానితో హారతి కర్పూరమును పసుపుపొడిని చేర్చి మెత్తగా కొట్టి శరీరమునందం తటను రుద్దవలెను. లేక మునగచెక్కనుమాత్రము పొడిచేసి రుద్దవలెను. చలువ తగ్గునంతవరకు అరగంట కొకమారు రుద్దవలెను.

—{ లశునాదిలేపము. }—

వెల్లుల్లిపాయలను చక్కగానొలిచి పైపొట్టుదీసి మెత్తగానూరి యరికాళ్లకును అరిచేతులకును రుద్దవలెను. దానిని బ్రాందీలో కలిపియు రుద్దవచ్చును. గంటకొకతూరి రుద్దినచో చలువమాని యుష్ణముకలుగును.

—{ కర్పూరతైలాది లేపము. }—

కర్పూరతైలమునైనను ఊదుకులామునైనను శరీరమునందంతటను రుద్దవలెను. అరగంట కొకతూరి రుద్దుచున్న చలువ తగ్గును.

—{ సర్షపాదిలేపము. }—

ఆవాలపిండిని కర్పూరమును సమముగ కలిపి కాళ్లకును చేతులకును రుద్దవలెను. శరీరమునం దంతటను గమ్మియుండునట్లు కంబళ్లచే గప్పవలెను. చలువ తగ్గి వేడికలుగును.

—{ కర్పూరాదిలేపము. }—

హారతికర్పూరమును పసుపుపొడిని ఉలవపిండిని సమముగ జేర్చి కాళ్లుచేతులకును శరీరమునందంతటను చలువ తగ్గునంతవరకు రుద్దుచుండవలెను. చలువ తగ్గును.

—{ కుళుత్థాదిలేపము. }—

ఉలవపిండి, మెత్తగాతాల్చిన కచ్చికబూడిదె, పసుపుపొడి, వీనిని సమముగజేర్చిగాని వేర్వేరుగగాని చలువ తగ్గునంతవరకు మాటిమాటికి రుద్దవలెను.

సైకతాదిస్వేదము.

ఇసుక, ఉప్పు, కందులు, ఇటికెరాతిపొడి, గోధుమల పొట్టు, తవుడు, మొదలగువానిని మూకుటిలోవేసి వేచి గుడ్డలోబెట్టి యోర్వదగినంత వేడియుండునట్లు దేహమునకు కాపుపెట్టవలెను. కంబళిచే దేహమంతయు గప్పనగును. శీతలముతగ్గి వేడినిగల్గించును.

ఉష్ణోదకోపచారము.

వేడినీళ్లతోనింపిన సీసాలను నీరు కారకుండునట్లులు మూతికి మంచి బిరడాలుమూసి బిగియించి యాసీసాలను చలువగ్రమ్మిన రోగికి నలుప్రక్కలనుంచి పైన కంబళ్ళచే గప్పుటమంచిది.

కాళ్లు చేతులు నరములు లాగుటకును, కొంకరలుబోవుటకును చికిత్స.

కలరావ్యాధి మిక్కిలి యభివృద్ధినొందినదనుటకు కాళ్ల యందును చేతులయందును నరములు లాగుటయు కొంకిరలు బోవుటయు నొకలక్షణముగనున్నది.

ఇట్టి క్రూరదశయందు వాతగజాంకుశము మిక్కిలి చక్కగ పనిచేయనోపును. మరియు చలవతగ్గుటకై పైజెప్పిన మునగచెక్కపొడి మొదలగు బాహ్యోపచారములును, హితముగపిసుకుటయు మంచిది.

మఱియు విఖ్యాతములగు నారాయణతైలము, ప్రసారిణీతైలము, అర్కక్షీరతైలము, మొదలగు తైలములనుబూసి కొంతకాలమువఱకు గుడ్డచుండవలెను.

— మూత్రమును వెడలించు నుపాయములు. —

కలరావ్యాధియందు విశేషముగ మూత్రముబంధించుట గూడ యుపద్రవమైయున్నది. శరీరమునందలి సౌమ్యములగు ద్రవధాతువులన్నియు విరేచనరూపముగ బోవుటయు సహజము. దానంజేసి మూత్రము బైటవెడలక బంధించియుండుటయు గలదు. కొన్నిసమయములయందు విరేచనము లగుచున్నను కాకున్నను మూత్రము బంధించుటయు కలదు. ఇట్టి దురవస్థగోనరోగులు అయిదారు దినములవరకును జీవించియుందురు. ఆ కాలమునకు దగిన యుపచారములఁ జేసినచో నట్టి క్రూరావస్థగూడ శమించి జయమును గాంచనగును.

మూత్రమును బంధించి వమనవిరేచనములు రెండును లేక విరేచనములు మాత్రంబైనను అగుచున్నయెడ అట్టి విరేచనముల కట్టునట్టి నల్లమందుతోఁ జేరిన యేమందునైన నుపయోగింపంజనదు.

చలువలేక యే మూత్రము బంధించినను, లేక చెమట పడియుచు మూత్రము బంధించినను ఈ క్రింద గనుపరపబడిన యుపచారముల జేయుట యవసరము. లేనిచో దగువైద్యుల సహాయము నపేక్షించుట యుచితము.

—॥ మూత్రము స్రవించుట కుపాయములు. ॥—

రెండు శేరుల నీళ్లలో పదునిమిది గురిగింజలయెత్తు మంచి సురేకారమును వేసి కాచి యా వేడినీటిలో కంబళిబట్టను తడిపి నీరుపిండి వేడిగానుండు నాకంబళిబట్టచే పొత్తికడుపున పలుమారు కాపు కాచవలెను. గంటకొకతూరి పదిపదునైదు నిముసములకాలము కాచుచుండిన మూత్రము వెడలును.

—॥ సురేకారాది లేపము. ॥—

సురేకారము, రేవలచిన్ని, ఈ రెంటియందును బ్రాంది సారాయి, గోమూత్రము, ఈ మూడిటిలో నొకదానిని కలిపి మెత్తగ గంధమువలె నరగదీసి పైజెప్పిన కాపుపెట్టిన పదినిముషములకు పొత్తికడుపుమీద పట్టువేయుట యుచితము. ఈ కాపును పట్టును రెండుతడవలు చేయులోపల మూత్రము ధారాళముగ స్రవించును.

—॥ ఇక్షురాది క్షారలేపము. ॥—

నీరుగొబ్బిని సమూలముగ నొకమూకుటిలో నుసిచి మాడిచి బూడిదెచేసి యాబూడిదెను కొంచెము సురేకారమును గోమూత్రముతో నూరి పొత్తికడుపుమీద పట్టువేసినచో మూత్రము ధారాళముగ వెడలును.

పైజెప్పినవానితో రాతికాయ నరగదీసి పట్టువేసిన మూత్రము వెడలును.

—(మూత్రఘ్న రసాదిపానము.)—

పొంగించిన గంధకమును తడవకు రెండు మొదలు ఆరు గురిగింజల యెత్తువరకు ఒక శేరు నీటిలో గలిపి తడవ కొక గ్రుక్కెడు నీళ్లు నంతున గంటకొకతూరి యిచ్చుట మంచిది. పైని జెప్పిన పట్టులను కాపును వేసినను మూత్రము ధారాళముగ విడుచుచున్నచో నీచికిత్సను జేయవలెను.

—(పునర్నవాదికషాయము.)—

తెల్లగలిజేరు వేళ్లైనను, ఏనుగుపల్లేరుకాయలైనను, పల్లేరు సమూలమునైనను నలుగగొట్టి రెండుపలముల పరిమితముగ గ్రహించి యొకసేరు నీళ్ళుపోసి నాలుగైదు పొంగులు వచ్చునంతదాక కాచి వడియగట్టి చల్లార్చి యాకషాయమున పొంగించిన ప్రత్తిందినికలిపి తొమ్మిది గురిగింజలయెత్తు మంచి సురేకారమును కూడకలిపియుంచునది. చెమటలు విశేషముగ నుండి మూత్రము విడలనిసమయమున పైజెప్పిన కాపును వేసి పట్టును బెట్టుచు నీకషాయమును గంటకొకతూరి తడవకు గ్రుక్కెడువంతున త్రాగించినచో మూత్రముజనించి ధారాళముగ విడచును.

—(దూర్వామూలాది కషాయము.)—

పచ్చగరిక వేళ్లు, చెరకువేళ్లు, దర్భవేళ్లు, పూచికవేళ్లు, రెల్లువేళ్లు, వరిగడ్డివేళ్లు, వీనిలో నొకదానినైనను కొన్నిటినైనను అన్నిటినైనను పచ్చివిగ దెచ్చి మెత్తగ నలుగగొట్టి

దానికనిమిదింతలనీళ్లుపోసి రెండు మూడుపొంగులు వచ్చునంత వరకును కాచి వడియగట్టి చల్లార్చి యుంచునది. మూత్రము బంధించి యెట్టియవస్థలోనున్నను పైనుదహరించిన కావును పట్టులను వేయుచు నీకషాయమును గంట కొక గ్రుక్కెడు యిచ్చిన మూత్రము గలిగి నిరాటంకముగ వెడలును.

చలువయును చెమటయును లేక మూత్రము బంధించి యున్నపుడు చేయదగిన చికిత్స.

దప్పి యధికముగనుండి చలువలు గ్రమ్మక బంకచెమటలు లేక మూత్రము బైటరాక బంధించియుండునపుడు లేత కొబ్బరికాయనీళ్లను అప్పుడప్పుడును ఇచ్చుచుండుట మంచిది.

మూలకాది స్వరసము.

ముల్లంగిదుంపలను అరటియూచలను సమభాగములుగ గ్రహించి రోటవేసిదంచి రసమునుదీసి యందు కొంచెముగ తాటికల్కండనుకలిపి గ్రుక్కెడు త్రాగించవలెను. దీనిని గంట కొకతూరి త్రాగుచున్న మూత్రము నిరాటంకముగ వెడలును.

పాషాణభేది కషాయము.

పిండికొండ, దోసగింజలు, ఈరెండిటిని ఒక్కొకపలము వంతున గ్రహించి నలుగగొట్టి మూకుటిలోనునిచి యొకసేరు నీళ్లుబోసి రెండుమూడు పొంగులువచ్చునట్లు కాచి వడియగట్టి చల్లార్చి యందు తాటికల్కండను కొంచెముగ కలిపి గంటకొక గ్రుక్కెడువంతున త్రాగించినచో మూత్రము జల్లనివెడలును.

— మూత్రబంధమున క్షారప్రయోగము. —

పైజెప్పిన చికిత్సల నుపయోగించినను మూత్రము వెడలక బాధపడుచుండువారలకు క్రింద చెప్పబడు ప్రయోగముల నుపయోగించినచో మిక్కిలి యుపకారకములై యుండును.

— అపామార్గాది క్షారయోగము. —

ఉత్తరేణి, సిరుగొబ్బి, అరటి, ముల్లంగి, మొదలగు వానిని కల్పమున జెప్పినప్రకారము క్షారముజేసి యాక్షారములనైనను, సర్జక్షారమునైనను, యవక్షారమునైనను, రోగియొక్క బలమును రోగముయొక్క స్థితిని పరిశీలించి తదనుసారముగ నాలుగుండి మూడు గోధుమగింజలంత పరిమితిని పైజెప్పిన కషాయములలో నొకదానితోనైనను లేక బారలి బియ్యపు గంజితోనైనను కలిపి గంటకొకతూరి యిచ్చినచో నాల్గు క్షారమును మూత్రబంధములునువదలి మూత్రముధారాళముగ వెడలును.

— ఇక్షురాదికషాయము. —

సిరుగొబ్బిని దెచ్చి నలగగొట్టి మొనిమిదింతల నీళ్లుబోసి యొకటిరెండుపొంగులు వచ్చునంతవరకు కాచి వడియగట్టి చల్లార్చి తడవకొక గ్రుక్కెడువంతున రెండుగంటలకొకతూరి యిచ్చిన మూత్రము వెడలును.

— శిలాఫలాదిపానము. —

గాలిగాయను సానమీద నిమ్మకాయరసముతో గంధమువలె నంగచాది పుల్లనితరవాణినీళ్లలో పావుతులము కలిపి

యిచ్చినచో వెంటనే మూత్రము వెడలును. అవసరమును బట్టి గంటకొకసారి యిచ్చుచుండవలెను.

మూత్రము ధారాళముగ వచ్చునంతవరకును పైని జెప్పిన కషాయములను, వేడికాపడములను, పట్టును సాధ్యమగునంత వరకు చేయుచుండవలెను.

మరియు బాల్లిబియ్యపు పేలగింజల తెల్లవాములను కలిపి యిచ్చుచుండవలెను. మూత్రమును అనాయాసముగ వెడలించుటలో నింతకన్న వేరుప్రక్రియ కానరాదు. ఇయ్యాది మూత్రమును వెడలించి రోగికి బలమునుకూడ నిచ్చును.

మరియు మిక్కిలిక్రూరమగు మూత్రబంధమును చింతామణియందు జెప్పిన శంఖద్రవమును శోరజద్రవములను మూడు నాల్గు బొట్లను గుక్కెడు నీళ్లలో కలిపి యిచ్చుట యుచితము. వీనినిమాత్రము గర్భిణీస్త్రీలకును పసివారలకును వృద్ధులకును నుపయోగింపంజనదు.

చతుర్థప్రకరణము.

— కలరారోగుల నుంచవలసిన నియమములు. —

కలరావ్యాధి తగిలినదని తెలిసినతోడనే యారోగిని తత్కాలమున సమీపమునసుండు దొరతనమువారి చికిత్సాలయములకుగాని యిందుకై ప్రత్యేకముగ నియమితములగు వైద్యాలయములకుగాని పంపుట మంచిది. అచ్చటనుండు

చికిత్సకులు రోగికి తగిన యుక్త సౌకర్యములు నేర్పరిచి ఆయా సమయములనెఱింగి శాస్త్రానుచితముగ చికిత్సలు జేయుదురు. తగిన పరిచారకుల నియమించి సమయోచితములగు నుపచారములఁజేయ నియమించెదరు. ఇట్లుచేయుటకు మనము కొంత ద్రవ్యవంతులుగనున్నను రోగులకు సమయోచితముగ తగు నుపాయముల జేయజాలము. కావున రోగిని రోగ ప్రారంభదశయందే చికిత్సాలయమునకు బంపుట యుచితము. చికిత్సాలయములకు రోగిని బంప నిష్టములేకున్నను, చికిత్సాలయములు దూరముగ నున్నను రోగిని యీక్రింద గనబడు విధముగ నునిచి యౌషధముల నుపయోగించుచు తగిన యుపచారములు చక్కగ జరుగునట్లు తగిన యేర్పాటు చేయవలెను.

—। రోగిని ప్రత్యేకముగనుంచు నుపాయములు. ।—

ఈ వ్యాధి తగిలినతోడనే రోగగ్రస్తుని శుభ్రముచేయబడి మంచిగాలి వీచుచుండు ప్రత్యేకస్థలమునందైనను, మంచి గాలి వచ్చు గదియందైనను ఉంచవలెను. రోగిని నుంచు చోట నావశ్యకములగు బట్టలు పెట్టెలు పరుపులు మొదలగు సామానులు నుంచకూడదు. ఇట్టి సౌకర్యములుగల యిండ్లు లేనివారు కిటికీలు విశాలమై శుభ్రమై గాలివీచుచుండు గది యందైనను నుంచవలెను. రోగి నివసించుగది యొక్క వాకిళ్లకును కిటికీలకును పచ్చివేపాకుతోరణములను ప్రతిదినంబును

ఉదయకాలమున కట్టుచుండవలెను. గదిని ప్రతిదినంబును రెండు మూడు తడవలు చక్కగ నూడ్చి యందు వేపాకు వస హారతి కర్పూరము ఈమూడిటిని వేసి కాచబడిన నీటి నైనను వేడినీళ్ల నైనను చిలకరించవలెను. ఆగదిలోనికి గాలి నిరాటంకముగ వచ్చిపోవునట్లు వాకిటితలుపులను కిటికీలతలుపులను తెరిచి యుంచవలెను. ఆగదియందుగాని సమీపమునగాని గంధకము, సాంబ్రాణి, దశాంగము మొదలగువాని ధూపములు [illegible] వేయుచుండవలెను. ఆగదిలోనికి రోగికి పరిచర్యచేయువారు దక్క నితరులెవ్వరును పోకుండ నియమించవలెను. రోగిని యితరులతో మాటలాడ నియ్యగూడదు. అవసరమున్నపుడు పరిచారకులు నెమ్మదిగా మాటలాడి తగుపరిచర్యల జేయవలెను. అటుగాక బంధువులు మిత్రులు మున్నగువారితో నిచ్చవచ్చినట్టులు మాట్లాడినచో నాయాసము మున్నగు నుపద్రవములు జనియించును. విశేషముగ బడలికయు సంభవించును.

—॥ రోగిని పరుండబెట్టుట. ॥—

రోగిని మెత్తనిపరుపుపై పరుండబెట్టుట మంచిది. రోగి నెంతమాత్రము కూర్చుండ నియ్యజనదు.

—॥ వస్త్రములు శుద్ధిపరచుట. ॥—

రోగి కుపయోగింపబడిన బట్టలు దుప్పట్లు మొదలగు వానిని వసను వేపాకును కర్పూరమును వేసి కాచబడిన నీటిలో దడిపి యుడకబెట్టి యెండవేయవలెను. రోగియొక్క మలమూత్రము వాంతి వీనిచే దడిసిన గుడ్డలను పైజెప్పినరీతిగ నీటిలో

నుడికించినట్టైనను మఱియొకవిధముగనైనను శుభ్రపరచి యెండ వేయవలెను. వీని నితరు లెవ్వరు నుపయోగింపకూడదు. రోగికి నుపయోగించిన చిన్న చిన్న బట్టలను మలము మున్నగు వాని తోగూడ దూరమున నొకగోతిలో నునిచి పైజెప్పిన వేడి నీళ్లలో కలిపిన మట్టిని పైన నునిచి పాతిపెట్టవలెను. లేక అట్టి మలినవస్త్రాదులను కొంతచెత్తను ఉముకను జేర్చి వెంటనే కాల్చివేయుట సర్వోత్తమము. అట్టి మలాదులగలసిన బట్టలను ఇతరవస్తువలును ప్రమాదముచేనైనను వీధులు దొడ్లు మున్నగు స్థలములలో పారవేయదగదు. దీనినిమాత్రము మఱువక జ్ఞప్తినుంచుకొనుట యావశ్యకము. అట్టి మలినవస్త్రములను అప్పుడే కాల్చక కొందరు చికిత్సకులు జేయునటుల విషపరిహారమనందగు నీటిలో కొన్నిగంటలకాలము వేసియుంచుటయు పిదప కాల్చుటయు లేక పాతిపెట్టుటయు తగదు.

రోగి కప్పుడప్పుడును శరీరమున వెడలు చెమటను బట్టచే తుడుచుచుండవలెను. అట్లు తుడిచినగుడ్డలను పైజెప్పినట్టులు కాచబడిననీటిలో నుడికించి యుతికి ఆరవేయవలెను.

—పాత్రలు.—

రోగికి మందులనిచ్చిన పాత్రలను పైజెప్పిన నీటిలో కడిగి యుంచవలెను. రోగి యాహారమునకై వినియోగించిన పాత్రలను కొంతసేపు నిప్పులలో పొరలించి పిదప చక్కగతోమి పైజెప్పిన వేడినీటిలో శుభ్రము చేయవలెను.

—(ఆహారపదార్థములు.)—

రోగి భుజియింపగా మిగిలిన గంజి మున్నగు నాహారపదార్థములను పానీయములను ఇతరు లెవ్వరు నుపయోగింపం జనదు. వానిని చెత్తతోకలిపి కాల్చివేయవలెను. లేక గోతి త్రోనునిచి పాతిపెట్టవలెను.

—(బంధువులు పోరాదనుండుట.)—

రోగికి పరిచర్య జేయువారుదక్క— పేరెవ్వరును రోగికడకు పోకూడదని పైనదెలిపియుంటిని ; ఏలయన ? కలరా వ్యాధి అంటువ్యాధులలో మిక్కిలి ప్రసారస్వభావముకలదికావున సంబంధపడువారలకందరకును వ్యాపించును. గాన రోగము స్వస్థమగునందాక యింటనుండువారు ఇరుగుపొరుగు వారియిండ్లకు పోవుటయు వారిని తమయింటికి రావించుటయు కూడదు.

—(రోగియింటియందలి వస్తువుల గ్రహింపకుండుట.)—

రోగినివసించు నింటిలోనుండు వస్తువుల దేనినైనను ఇరుగుపొరుగువారు కోరికను తీయుదగదు.

—(ఇంటిని శుభ్రము జేయుట.)—

రోగము స్వస్థమైనపిదప నాయింటికిని ముఖ్యముగ రోగి నివసించియున్న ప్రదేశమునకును చక్కగ సున్నమును పూయించవలెను. విధివశమున నొకవేళ రోగి మరణమునొందినచో వెంటనే యాశవమునకు దహనాది సంస్కారముల జేయుటకు దగిన యేర్పాటుల జేయవలెను. లేక పారిశుధ్యసంఘమును వారికి దెలిపిన శుభ్రము జేయుదురు. ఇతరకారణములచే

చనిపోయిన శిశువులవలె కొంతతడవు ఉంచినచో నియ్యంటు వ్యాధుల వ్యాపకిని సోచ్చుననుట కెట్టిసందియంబును లేదు.

పరిచారకులు.

రోగికి పరిచర్యల చేయువారు మిక్కిలి పరిశుద్ధులై యుండవలెను. రోగిని స్పృశించునపుడును, మందులు ఆహారములు మున్నగువాని నిచ్చునప్పుడును, వాంతులు మలము మూత్రమువానిని తీయునపుడును మిక్కిలి మెలకువతో నుండవలెను. అట్టి కార్యములు జేయునపుడెల్ల తమచేతులను పరిశుభ్రముగ పైజెప్పిన వేడినీటిచే రెండుమూడుతడవలు కడుగుచుండవలెను.

పరిచారకులు తాము ఆహారాదుల జేయునపుడును ఉదకమును ద్రావునపుడును పైజెప్పబడిన వేడినీటియందు తమబట్టలను చక్కగనుడికించి యుతికి ఎండవేసి తామానీటి యందే స్నానముచేసి కట్టుకొని పిమ్మట భుజింపవలెను. రోగికి తాము పరిచర్య జేయునంతదనుక తమ వస్త్రములు పరుండు చాపలు మున్నగువానిని ప్రత్యేకస్థలమున నుంచుకొని తామును ప్రత్యేకస్థలమునందే యుండవలెనుగాని యితరులతో సంబంధము కలిగి యుండజనదు.

విషూచిరోగులకు పథ్యములు.

స్వచ్ఛములైన బారలిబియ్యమును ఒకపిడికెడు గ్రహించి అందు రెండుసేరులు నీళ్లుపోసి మూడునాల్గు పొం

గులు వచ్చువఱకు చక్కగ కాచి వడబోసి తేటనైయుండు జావను తీసికొని యందు మితముగ నుప్పును వేసి కొంచెముగ నిమ్మకాయ రసమును కలిపి మూడుగంటల కొకసారిగాని రోగికి అనుకూలముగ అప్పుడప్పుడుగాని కొంచెము కొంచెముగ నియ్యవలెను.

శాలిబియ్యము దొరకనిచో చిట్టిముసుకు నీళ్లనుతీసి యందు మితముగ నుప్పును నిమ్మకాయపులుసును జేర్చి విషూచియం దిచ్చుట మంచిది. బియ్యమును వేయించి బద్దలుగ పగులగొట్టి మిక్కిలి పలుచనగ గంజికాచి కొంచెము నిమ్మకాయ రసమును ఉప్పును కలిపి యిచ్చుట యుచితము. దీనిచే నాకలియు దప్పియు తగ్గును.

—(కలరా వ్యాపించియుండు సమయమునం దపథ్యములు.)—

అన్నము.—ఆకలి కాకున్నపుడు భుజింపవలదు. చక్కగ పక్వములుగాని పదార్థములను మాడినపదార్థములను వాంతినికల్గించు పదార్థములను ఒకప్పుడు నుపయోగింపంజనదు.

పిండివంటలు.—అజీర్ణమును జేయు మినపకుడుములు, అట్లు, ఉండ్రాళ్లు, కుడుములు, రొట్టెలు, రాగిసంకటి, అంబలి, సజ్జరొట్టెలు, జొన్నసంకటి, ఆరుకయన్నము, మొదలగు వానిని కంటనైనం జూడకూడదు. బజారులలో నమ్ము మిటాయి మున్నగువాని నేమాత్రమైన భుజింపదగదు.

కూరలు.— చేమదుంపలు, చిలగడదుంపలు (గెనసుగడ్డలు), పెండలము, బంగాళాదుంపలు (ఉర్లగడ్డలు), అనపకాయలు, అరటిబొండె, అవిసియాకు, మునగాకు, గోంగాకు, గుమ్మడి, దోస, పనస, బెండ, గోరుచిక్కుడు, మామిడి, పచ్చిమిరపకాయలు మొదలగువానిని విడువవలెను. ముదిరినవియు కుళ్లినవియు ఎండినవియునగు కూరగాయ లెప్పుడైనను విడువనగును.

బియ్యము.— ముక్కిన బియ్యము, క్రొత్త బియ్యము, చక్కగా దంపని బియ్యము, ఊకమున్నగువానితో కూడిన బియ్యము, వీని నన్నము వండుటకుపయోగింపంజనదు.

పప్పులు.— బఠానులు, వేరుసెనగకాయల్లు, జీడిపప్పు (ముంతమామిడిపప్పు), కంది, సెనగ, మినుములు మొదలగు పప్పులు, అనుములు మొదలగువానిని విడువనగును.

పండ్లు.— సీతాఫలపండ్లు, జామపండ్లు, అరటిపండ్లు, కొబ్బరి, పుల్లనినారింజపండ్లు, మామిడిపండ్లు, నాగజెముడుపండ్లు, కలివిపండ్లు, పరికెపండ్లు, పుల్లరికెపండ్లు మొదలగు పండ్లను కుళ్లినవియు నెండినవియునగు పండ్లను విడువవలెను.

పచ్చళ్లు-ఊరుగాయలు.— అనపచ్చడియు, పచ్చిమిరపకాయపచ్చడియు, అనపకాయ మొదలగు నూరగాయలును కూడదు.

మాంసములు.— రోగులు జాడ్యముకల మృగములయొక్కయు పక్షులయొక్కయు మాంసంబులును, పందిమాంసంబును, ఉప్పుటెంచలును, ఎండ్రకాయలును, నత్తగుల్లలును, కుళ్లిన

వియు ఎండినవియునగు మాంసములును ఉపయోగింప దగవు.

చేపలు.—మెత్తాళ్లును రొయ్యలును పిలవాలుగ మొదలగునవియును కుళ్లిన చేపలును కూడదు.

నీళ్లు మొదలగునవి.—ఈ వ్యాధి వ్యాపించియుండు ప్రదేశముల లోని నీళ్లు మజ్జిగ పెరుగు పాలు మొదలగు ద్రవపదార్థములను ఒకప్పుడును నుపయోగింపఁజనదు.

నివాసము మొదలగునవి.—ఈవ్యాధికల ప్రదేశముల యందు వారితోఁ మాటలాడుటయు వారియింటను భుజించుటయు అచ్చట పరుండుటయు ఆ ప్రదేశములకు పోవుట మొదలగువానిని మానియుండుట చాలయుక్తము.

మత్తుపదార్థములు.—మత్తును కలిగించెడి సారాయి బ్రాందీ కల్లు గంజాయి నల్లమందు మొదలగువాని సేవించుటను మానవలెను.

—(కలరా వ్యాపించియుండుసమయమున నాచరించు పథ్యములు.)—

గృహము.—ఇంటిలోపలను సమీపమున నలుదెసలయందును ముఱికి, పేడ, చెత్త మొదలగు మలినవస్తువులు లేకుండునట్లులు చేయవలెను. బొస్సులచెంత నేమాత్రంబును నీరుచేరక యుండునట్లుంచవలెను. దొడ్లయందైనను ఇంటికిసమీపమునందైనను ఎంగిలిపాత్రలను తోమకూడదు. వంటయిండ్లు మొదలగు ప్రదేశములను వేడినీళ్లతో నలకక పైచెప్పినరీతిగ వేడినీళ్లను కాచి యందు మట్టినికలిపి యానీటిచేనలుకుట మంచిది. కుళ్లినవియు

[illegible] వారంగినపిదపను పండ్లు, కూరగాయలు, పాసినములు మున్నగువానినుంచకూడదు.

పొగ వేయుట.—ఇండ్లయందును ఇండ్లసమీపప్రదేశములయందును గంధకమును పొగ వేయుచుండవలెను. మరియు సాంబ్రాణి సర్జరసము గుగ్గిలము మొదలగు సువాసనద్రవ్యములచే పొగ వేయుటయు నుచితము. ఇంటిని ప్రతిదినమును అన్ని భాగములయందును బూజు మొదలగు మలినవస్తువులు లేకుండునట్లు చక్కగ చిమ్ముచుండవలెను. అన్ని స్థలములయందును క్రొత్తసున్నమును పూయుచుండవలెను. మరియు జలదారులు స్నానప్రదేశము వంటచేయుస్థలములు మున్నగు ప్రదేశములయందు ఎల్లప్పుడును మలినమించుకేనియు లేకయుండునట్లు శుభ్రముగ నుంచవలెను. ఇంటివాకిళ్లయందును ఇంటిలోపల గదులయందును ప్రతిదినము పచ్చివేపాకు తోరణములు కట్టుచుండవలెను.

మరుగుదొడ్లను చక్కజేయుట.—మలమూత్రములవిసర్జించు ప్రదేశములను పలుమారు శుభ్రములుగ జేసి కర్పూరమును వసను వేపాకును వేసి కాచబడిన వేడినీళ్లతో కడుగుచుండవలెను. లేక వేడినీళ్లతోనైన కడుగుచుండవలెను.

నీళ్లు.—త్రాగు నీళ్లు, బావులు, చెరువులు గుంటలు చెలములు మున్నగువానియందుండు నీళ్లను రెండుమూడు తడవలు వడబోసి రెండుమూడు పొంగులు వచ్చునందాక కాచి కొంచెము గోరువెచ్చగనుండునట్లు చల్లార్చి యుప

యోగింపవలెను. బియ్యము కూరలు మున్నగువాని కడుగుటకును అన్నము కూరలు మున్నగువానిని వండుటకును పాలు పెరుగు మజ్జిగ మొదలగువానియందుప యోగించుటకును పైజెప్పిన ప్రకారము వడగట్టి కాచబడిన నీటినే యుపయోగింపనగును. స్నానమునకును దాహమునకునుగూడ అట్టిజలమునే ఉపయోగింపనగును.

ఆహారము.—భోజనపదార్థములలో మిక్కిలి శీఘ్రముగ జీర్ణములగునవియు అలవాటులో నుండునవియు చక్కగ పచనము చేయబడినవియు కొంచము వేడిగనుండునవియునగు పదార్థముల భుజియింపనగును. అలవాటులో లేని యాహారపదార్థముల సేవించుటయు అలవాటున నుండు లఘ్వారపదార్థముల విడచుటయు దగదు. సకాలమున మితముగ భుజింపవలెను. తా నెప్పుడును భుజించు పరిమితమునకన్న కొంచెము తక్కువగ భుజించుట యుచితము. అలవాటుగ భుజించు పదార్థములలో ఉప్పును కారమును మామూలుకన్న కొంచెము తగ్గించి చేర్చి యుపయోగించుట మంచిది. తా నేవిధమైన యాహారమును జేసినను అయ్యది శీఘ్రముగ జీర్ణమై చక్కగ నాకలిని పుట్టించునదిగ నుండవలెను.

పాత్రలు.—ఇంటిలో నానాకృత్యముల కుపయోగింపబడు చెంబులు తపెలలు మున్నగు. పాత్రలను కొంచెము నిప్పులలో పొరలించి కాచి పైజెప్పిన వేడినీటిలో శుద్ధి చేసి యుపయోగించుకొనవలెను. నీళ్లు త్రాగుటకును

పాలకును మజ్జిగకును వంటకును ఉపయోగించు పాత్రలను మిక్కిలి జాగ్రత్తతో మలిన మొకింతయు లేకుండ శుద్ధిచేయవలెను. పిదప నాపాత్రలను చేతులను శుద్ధి చేసికొనక ముట్టగూడదు.

వస్త్రములు.—పైజెప్పినరీతిగ సిద్ధము చేయబడిన వేడినీటిలో బట్టలను కొంతసేపునానబెట్టి చక్కగనుతికి యారవేసి కట్టుకొనవలెను. పక్కకై యుపయోగించు బట్టలనుదుప్పట్లను చెమటబట్టిన బట్టలను ప్రతిదినంబును పైజెప్పిన నీటిలో నానబెట్టియుతికి మంచియెండలో నారవేయవలెను.

శయనోపకరణములు.—చాపలు తివాచులు పరపులు మొదలగు శయనోపకరణములను ప్రతిదినంబును రెండు మూడు గంటలసేపు ఎండలో వేయుచుండవలెను.

నిద్ర.—విశేషముగ గాలియందును బైళ్లయందును నిద్రింపకూడదు. పగటియందు నిద్రించుటయు రాత్రులలో నిదుర మేల్కొంచుటయు హానికరములు. రాత్రులయందు వాడుక ప్రకారము నియమిత కాలము నిద్రించుట యుచితము.

బాహ్యోపచారములు.—అజీర్ణము లేక కడుపులో గుట్టు గుట్టుమని శబ్దముకలవారు మంచిఫ్లానల్ బట్టను పొట్ట చుట్టును ఒకటిరెండు వరుసలు చుట్టుకొని యుండుట హితము.

భీతినివదలుట.—ఈవ్యాధి మిక్కిలి క్రూరమైన వ్యాధియనియు దీనిచే ననేకులు మరణము నొందుచున్నారనియు

దలంచి మనసున కొంచెమైన భయమును దిగులును ఉంచుకొనక ధైర్యముకల్గి యుండవలెను.

—| స్వాస్థ్యపరిపాలనము. |—

“ధైర్యం సర్వార్థసాధకమ్” అను నార్యోక్తి ననుసరించి ధైర్యమునవలంబించిన వారికి నిట్టిక్రూరములగు శారీరక మానసికాదివ్యాధులును గూడ చెంత జేరవు. సాంక్రామికములగు నిట్టివ్యాధులు వ్యాపించి వానిప్రభావమును జూపునవుడు వాని బారినుండి యాయువును పరిపాలించుకొనుటకై పూజ్యులగు శ్రీచరకాచార్యులు జనపదోద్ధ్వంసనీయమున * చూపిన హితాహితములును యుక్తమవిధులునునగు కొన్నిటి నిందు బొందు బరచెదను. ఇందు మనుజసామాన్యమునకును జేరియుండు సామాన్యభావములగు సాంక్రామికవ్యాధులుగ్గల దేశమును ఆప్రదేశమునందలి నీళ్లు పాలు గాలి ఈ నాలిగింటిని ముఖ్యముగ విమపదగినవని నిరూపించియున్నారు. మరియు నా ప్రదేశమందలి పదార్థసామ్యమును విమచుటయు, సాంక్రామికములు వ్యాపించుటకు పూర్వము సంగ్రహింపబడిన పదార్థముల నుపయోగించుకొనుటయు నుచితమని తెలియబరచియున్నారు. మరియు సత్యవంతుడుగను భూతదయ గలవాడుగను దైవభక్తిగలవాడుగను సద్వ్యాపారముల నాచరించువాడుగను


---

* “హితం జనపదానాం చ శివానాముపసేవనమ్” “సేవనం [illegible] [illegible]” [illegible] ఖలు ఇమే భావాః సామాన్యాః జనపదేషు భవన్తి. తద్యథా—వాయురుదకం దేశః కాల ఇతి.” చరకసంహిత, విమానస్థాన, అ. 8.

శమదమాది గుణసంపన్నుడుగను సర్వవిధముల నారోగ్యమును శాశ్వతబ్రహ్మచర్యనియమమును గలవాడుగను ఉన్నను ఆయుఃపరిపాలనమును చేయసమర్థుడగుననియు వక్కాణించి యున్నారు.

"నిత్యం హితాహార విహారసేవీ సమీక్ష్యకారీ విషయే ష్వసక్తః । దాతా సమః సత్యపరః క్షమావా న్ ఆప్తోపసేవీ చ భవత్యరోగః" వాగ్భటః. సూ. అ. 4.

ఇతి శ్రీమన్మహీశూర మహారాజధానీ మధ్యవిద్యోతమాన సర్వతోభద్ర దివ్య
రత్నసింహాసనాధీశ్వర శ్రీమద్రాజాధిరాజేత్యాది బిరుదావళీ విరాజమాన
శ్రీ శ్రీ కృష్ణరాజసార్వభౌమ సంస్థానాస్థానాయుర్వేద విద్వద్వైద్య
ప్రకాండ శ్రీమద్రాజకీయ సంస్కృత మహాపాఠశాలాయుర్వేద
మహోపాధ్యాయ అగరం. పుట్టస్వామి శ్రీచరణారవిన్ద సంసే
వాసమాసాదితాయుర్వేదవిద్యా సత్సంప్రదాయ గౌతమగోత్ర
విరాజమాన దీక్షితస్వామి శ్రీకృష్ణమాచార్యపౌత్ర కోదండ
రామాధ్వరి దౌహిత్ర రామకృష్ణార్య రాజ్యలక్ష్మ్యమ్బా
తనూభవ సకల సహృదయ విధేయ శ్రీమత్పంచమజార్జి
చక్రవర్తి ప్రదత్త "వైద్యరత్న" బిరుదావళీ విరాజ
మాన "ఆయుర్వేదమార్తాండ" భిషఙ్మణి,
పండిత డి. గోపాలాచార్య విరచితంబైన
"విషూచి - కలరా"
సమాప్తము.



498

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యుల

వారి సుప్రసిద్ధములగు

[illegible] ములు.

స్వదేశరాయాంధ్ర భాషానిలయము

సుల్తాన్ బజారు - హైద్రాబాదు ము.

ఇది నరములకు [illegible] శ్రీ పురుషు [illegible] వాడవచ్చును. బుద్ధిబలము [illegible] శరీరమంతయు [illegible] తెచ్చును. శరీరమంతయు [illegible]

వెల సీసా 1-కి రు. 3 - 0 - 0.

అమృతామలక తైలము.

ఇది స్నానమున నుపయోగించినచో శరీరమునకును మనస్సునకును చల్లదన మిచ్చును. అనుదినము దీని నుపయోగించినచో, దుర్బలత్వము [illegible] వలన గలుగు ననేక వ్యాధులు తొలగును. ఇది కంటికి చలువనిచ్చును. జ్ఞాపకశక్తి నభివృద్ధి జేయును. శరీరమును సమశీతోష్ణమునందుంచును.

వెల సీసా 1-కి రు. 0-12-0.

కర్పూరాద్యరిష్టము.

కలరా యేదశయందైనను జయింపగలదని నిపుణులచే ప్రశంసింపబడినదియు కలరాను రానీయక కాపాడుటలో నద్వితీయమైనదియు కర్పూరాద్యరిష్టము.

ద్రావకమును మాత్రలును చేర్చి వెల 0 - 12 - 0.

ప్యాకింగు పోష్టేజి ప్రత్యేకము.

ఆయుర్వేదాశ్రమము, 55 ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు